



వినాయకుడి విగ్రహాన్ని సముద్రంలో నిమజ్జనం చేసేందుకు వచ్చిన చిన్నారులు

నేడు జేఎన్‌టీయూకేలో గురుపూజోత్సవ కార్యక్రమం

- జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు
- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని కాకినాడ జేఎన్‌టీయూ అలూమ్నీ ఆడిటోరియంలో గురుపూజోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన ఆయన వెలువరించారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. జిల్లాలో 70మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ఇచ్చి సత్కరిస్తామన్నారు. కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు.

వాళ్లు ప్రత్యేకమైన ఉపాధ్యాయులు లోపల పేజీల్లో..

సూర్యారావుపేట బీచ్‌లో వైభవంగా గణనాథుల నిమజ్జనం



కాకినాడ సూర్యారావుపేట బీచ్‌లో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న యువకులు, పంచాయతీ, అగ్నిమాపక, పోలీసుశాఖల సిబ్బంది

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లోభాగంగా గురువారం కాకినాడరూరల్‌మండలం సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో గణనాథుల విగ్రహాలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. 8రోజులుగా ప్రత్యేక మండపాల్లో కొలువుదీరిన గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు, పలు రకాల ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాతోపాటు కాకినాడ రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ట్రాక్టర్లు, ఆటోలు, వేన్‌లపై ఊరేగింపుగా మేళతాళాలు, డీజేలతో యువత కేరింతలతో సూర్యారావుపేట బీచ్‌కి తీసుకెళ్లి అక్కడ సముద్రంగా ఘనంగా నిమజ్జనం చేశారు. బీచ్‌లో గణేష్ నగర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రెవెన్యూ, పంచాయతీ, అగ్నిమాపక, విద్యుత్తు, పోలీసుల ఆధ్వర్యంలో విగ్రహాల నిమజ్జనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నిమజ్జనం జరిగే ప్రదేశంలో గజ ఈతగాళ్లను పహారాగా ఏర్పాటు చేశారు. తిమ్మాపురం ఎస్‌ఐ వై.గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.



'స్థానిక' సందడి!

- ఉమ్మడి తూ.గో.లో మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు ముందస్తు సన్నాహాలు
- మునిసిపల్, పంచాయతీరాజ్‌శాఖలకు లేఖలు రాసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- 2026 జనవరిలోగా మునిసిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు వచ్చే నెల నుంచే సన్నాహాలు
- అక్టోబరు 15లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ
- నవంబరు 16 నుంచి 30లోగా పోలింగ్ కేంద్రాల ఖరారు, ఈవీఎంల సన్నద్ధత
- ఉమ్మడి జిల్లాలో రెండు కార్పొరేషన్లు, 9 మునిసిపాలిటీలు, 3 నగర పంచాయతీలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని స్థానిక సంస్థల ఎన్నికల సందడి కొన్ని నెలల్లో మొదలుకాబోతోంది. మున్సిపల్, పంచాయతీ ఎన్నికలను నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. వచ్చే ఏడాది జనవరిలోగా అంటే మరో ఐదు నెలల్లో మొత్తం ప్రక్రియ పూర్తి చేసి పోలింగ్, ఎన్నికల ఫలితాల ప్రకటనకు కార్యాచరణ సిద్ధం చేసింది. వచ్చే నెల నుంచే మున్సిపాల్టీలు, పంచాయతీల్లో వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ కసరత్తు ప్రారంభించాలని తాజాగా అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి త్వరలోనే మొదలు కానుంది. కాగా ఉమ్మడి జిల్లాలో రెండు కార్పొరేషన్లు, 9 మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీల్లో పుర ఎన్నికలు, 1,073 పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. కొత్త తూర్పుగోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే నిడదవోలు, కొవ్వూరు మున్సిపాలిటీలకు సంబంధించి వార్డుల పునర్విభజన చేయాల్సి ఉన్న నేపథ్యంలో పెరిగే కొత్త వార్డులతో కలిపి ఎన్నికలు నిర్వహించనున్నారు.

(కాకినాడ/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలుకాబోతోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో కాకినాడ, రాజమహేంద్రవరం కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలకు, ఆ తర్వాత పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్‌ఈసీ రంగం సిద్ధంచేస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరిలో 2021లో మునిసిపల్, పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఆయా మునిసిపల్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు మెంబర్ల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తికాబోతోంది. ఆ తర్వాత వీటికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే వీరి పదవీకాలం ముగిసేలోపు మూడు నెలల ముందే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈమేరకు పురపాలక, పంచాయతీరాజ్‌శాఖలకు ఎస్‌ఈసీ లేఖ రాసింది. మున్సిపాల్టీలు, పంచాయతీలకు వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలు నిర్వహించడానికి వీలుగా కసరత్తు ప్రారంభించాలని ఆదేశిస్తూ మార్గదర్శకాలు జారీచేసింది. దీని ప్రకారం వచ్చే నెల 15లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించింది. అక్టోబరు 16 నుంచి నవంబరు 15లోగా వార్డులవారీగా ఓటర్ల జాబితాల ప్రచురణ, నవంబరు 1 నుంచి 15లోగా ఎన్నికల అధికారుల నియామకం, నవంబరు 16నుంచి 30లోగా పోలింగ్ కేంద్రాల ఖరారు, ఈవీఎంలను సిద్ధం చేయడం పూర్తిచేయాలని ఆదేశించింది. డిసెంబరు 15లోపు రిజర్వేషన్లు ఖరారు, 2026 జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్, అదే నెలలో ఫలితాల వెల్లడికి వీలుగా ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఇక కాకినాడ కార్పొరేషన్‌కు 2022 సెప్టెంబరుకు అయిదేళ్ల పదవీకాలం పూర్తయిన తర్వాత మళ్లీ ఇప్పటివరకు ఎన్నికలు జరగలేదు. అయితే తాజా ఎస్‌ఈసీ ఆదేశాల నేపథ్యంలో వార్డుల పునర్విభజనతో అదనంగా మరో పది వార్డుల వరకు పెరిగే అవకాశం ఉంది. అటు రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో శివారు గ్రామాల విలీనం సమస్య పరిష్కారమై పెరిగే వార్డులతో కలిపి ఇక్కడా ఎన్నికలు జరగనున్నాయి. ఇదిలాఉంటే 2021 మార్చిలో ఉమ్మడి జిల్లాలో ఏడు మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీల్లో కలిపి మొత్తం 268 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. అప్పట్లో చేతిలో అధికారం ఉండడంతో వైసీపీ అడ్డగోలుగా 35 వార్డుల్లో బలవంతపు ఏకగ్రీవాలు చేయించింది. దీంతో 233 వార్డులకే ఎన్నికలు జరిగాయి. అయితే మళ్లీ ఇప్పుడు వార్డుల పునర్విభజన నేపథ్యంలో ఒక్కో మున్సిపాల్టీ, నగర పంచాయతీల్లో వార్డుల సంఖ్య మరింత పెరగనుంది. అలాగే ఉమ్మడి జిల్లాలో 2021 ఫిబ్రవరిలో 1,073 పంచాయతీల్లో నాలుగు దశల్లో 11,782 వార్డులకు 12,048 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు నిర్వహించారు. 31 పంచాయతీలకు వివిధ కారణాలతో ఎన్నికలు జరగలేదు. వచ్చే ఏడాది జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో వార్డులు మరిన్ని పెరగనున్నాయి.

అప్పుడంతా అరాచకం...

ఉమ్మడి జిల్లాలో 2021లో జరిగిన మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ అరాచకాలు సృష్టించింది. ప్రతిపక్ష టీడీపీ, జనసేనలను నానా హింస పెట్టింది. ఈ పార్టీల అభ్యర్థులను చాలాచోట్ల నామినేషన్లను దాఖలు చేయకుండా అడ్డుకుని ఏకంగా కిడ్నాప్‌లు చేసింది. బెదిరింపులకు దిగి ఏకగ్రీవాలు చేయించుకుంది. అయితే టీడీపీకి బలం ఉన్న చోట జనసేన, జనసేనకు బలం ఉన్న పలు చోట్ల టీడీపీ సహకరించుకుంటూ కదిలి వైసీపీ అరాచకాలను కొంతవరకు అడ్డుకోగలిగాయి. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి అఖండ విజయంతో అధికారంలోకి వచ్చింది. తర్వాత ఒక్కో మున్సిపాల్టీ కూటమి పరిధిలోకి వచ్చేశాయి. తుని, నిడదవోలు, కొవ్వూరు ఇలా కూటమిలో చేరిపోయాయి. ఇంకా కొందరు రావడానికి సిద్ధంగా ఉన్నా ఎన్నికలు జరిగే సమయంలో ఈ తలపోటు మనకెందుకులే అన్నట్టు వదిలేశారు. ఉమ్మడి జిల్లాలో పరిధిలో రాజమండ్రి, కాకినాడ కార్పొరేషన్లు, అమలాపురం, తుని, పిఠాపురం, సామర్లకోట, మండపేట, రామచంద్రపురం, పెద్దాపురం మున్సిపాలిటీలు, ఏలేశ్వరం, గొల్లప్రోలు, ముమ్మిడివరం నగర పంచాయతీలు ఉన్నాయి. అలాగే కొత్త తూర్పుగోదావరి జిల్లా పరిధిలో కొవ్వూరు డివిజన్ కూడా కలవడం వల్ల కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు కూడా వచ్చి చేరాయి. అంటే 2 కార్పొరేషన్లు, 9 మునిసిపాలిటీలు, 3 నగర పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది.



● రాజకీయ వర్గాల్లో సందడి

మునిసిపల్ ఎన్నికలు అనగానే పట్టణ ప్రాంతంలో రాజకీయ సందడి మొదలవుతోంది. రాజమండ్రి, కాకినాడ కార్పొరేషన్లకు పాలకవర్గాలు లేనందువల్ల అక్కడ ప్రజాప్రతినిధులు, పదవులు ఆశించేవారు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు. మిగతా మునిసిపాలిటీల్లో వైసీపీ నేతలు కూడా ఉన్న సంగతి తెలిసిందే. ఈసారి మొత్తం మునిసిపాలిటీలను కైవసం చేసుకోవడానికి టీడీపీ కూటమి సిద్ధమవుతోంది. మొత్తం కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో ఎన్నికలు జరిగితే 300మందికి పైగా కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా ఎన్నికవుతారు. ఇద్దరు మేయర్లు, 12 మంది మున్సిపల్ చైర్మన్లు వస్తారు. డిప్యూటీ మేయర్లు, కోపన్స్ సభ్యుల పేరిట కూడా పలువురికి పదవులు వస్తాయి. ఈనేపథ్యంలో టీడీపీ కూటమిలో బాగా సందడి పెరిగింది. వైసీపీ సరైన ప్రతిపక్షంగా కూడా లేకపోవడం వల్ల ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలనే మీమాంసలో పడింది. పలువురు వైసీపీ నేతలు వీలు దొరికితే కూటమిలోకి దూకేసే ప్రయత్నాలు ఇప్పటికే మొదలుపెట్టారు.



చీరలు అందుకున్న టీచర్లతో డిప్యూటీ సీఎం పేషీ అధికారులు

డిప్యూటీ సీఎం నుంచి ఉపాధ్యాయ దినోత్సవ కానుక 5



ఆహ్వాన పత్రిక విడుదల చేస్తున్న దృశ్యం

రేపటి నుంచి అమెరికామెడీ నాటికలు 5

స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీలో జాప్యం

- 6,36,238 కార్డులకుగాను ఇప్పటికి 91వేలకార్డులే అందజేత
- లబ్ధిదారులకు నిరాశ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీలో గందరగోళం నెలకొంది. స్మార్ట్ కార్డుల కోసం రేషన్ డీలర్ల వద్దకు వెళ్లిన లబ్ధిదారులకు నిరాశ ఎదురవుతోంది. జిల్లాలో ఈనెల ఒకటో తేదీ నుంచి అత్యంత ప్రతిష్టాత్మకంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభమైంది. జిల్లాలో మొత్తంగా 6,36,238 స్మార్ట్ రైస్‌కార్డులు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 91వేలకార్డులు మాత్రమే పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా కొన్ని మండలాల్లో ఒక సమస్య తలెత్తుతోంది. తీరా కొంతమంది లబ్ధిదారులు స్మార్ట్ రేషన్ కార్డుకోసం వెళ్తే మీ కార్డు ఇక్కడ లేదని బదులిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు అవాక్కవుతున్నారు. తమ కార్డు ఎక్కడ ఉంటుందని డీలర్లను ప్రశ్నించగా తొలుత ఎక్కడైతే ప్రింటింగ్ చేసిన రేషన్ కార్డు ఇచ్చారో అక్కడికి వెళ్లిపోవాలని బదులిస్తున్నారు. తొలుత ప్రింటింగ్ చేసిన కార్డులు ఇచ్చిన రేషన్‌డిపోలోనే స్మార్ట్‌కార్డులు మ్యాపింగ్ అయ్యాయని అంటున్నారు. కాకినాడతోపాటు పిఠాపురం, తుని, సామర్లకోట, పెద్దాపురం, గొల్లప్రోలు వంటి ప్రాంతాల్లో కొన్ని రేషన్ దుకాణాల చిరునామాలు మారిపోయాయి. గత ఆరేళ్లలో వివిధ కారణాలవల్ల ఇతర ప్రాంతాలకు రేషన్‌డిపోదారులు అద్దెకు వెళ్లారు. దీని వల్ల వీరివద్దకు వెళ్లి స్మార్ట్ కార్డులు తీసుకోవడం ఇబ్బందికరంగా మారింది. ఒక సరైన విధానం లేకుండా స్మార్ట్ రైస్‌కార్డులు పంపిణీ చేస్తున్నారని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు.

ఉదాహరణకు తీసుకుంటే కాకినాడ కొండయ్యపాలెంలో ఉంటున్న జి.జాస్సీరాణి అనే లబ్ధిదారురాలు కార్డు రేషన్‌సరకులు తీసుకుంటున్న కొండయ్యపాలెంలో కాకుండా నరసన్న నగర్ రేషన్ డిపోలో చూసుకోవాలని రేషన్ డీలర్లు బదులిచ్చారు. కాకినాడ రామారావుపేటలో ఉన్న మహిళ స్మార్ట్ రైస్ కార్డు కోసం వెళ్తే జి.మామిడాడ వెళ్లాలని సూచించారు. జి.మామిడాడ నుంచి వలస వచ్చిన నేపథ్యంలో అక్కడ రేషన్‌దుకాణానికే కార్డులు పంపించారని బదులిస్తున్నారు. ఇలా అనేక ప్రాంతాల్లో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి సత్యనారాయణరాజును వివరణ కోరడానికి ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

స్మార్ట్ కార్డుల పంపిణీలో సామర్లకోటకు ప్రథమ స్థానం

సామర్లకోట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీలో జిల్లాలో సామర్లకోట మండలానికి ప్రథమస్థానం లభించింది. మూడు రోజులుగా జిల్లాలోని అందరు రేషన్‌డీలర్లతో స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టగా మొదటిస్థానాన్ని సామర్లకోట మండలంలో 43,291కార్డులకుగాను గురువారం రాత్రి 8 గంటల వరకూ 14,862 స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేసి జిల్లాలో 34.33 పంపిణీ శాతంతో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుంది. ద్వితీయస్థానాన్ని పొందిన జగ్గంపేట మండలంలో 26,572 స్మార్ట్ కార్డుల పంపిణీకిగాను గురువారం రాత్రి 8 గంటల నాటికి 8,675 రేషన్‌కార్డులు పంపిణీ జరిగింది. మూడోస్థానంలో కరప మండలం నిలిచింది. పిఠాపురం మండలం 0.98 పంపిణీ శాతంతో అట్టడుగున ఉంది. జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ తీరును ఎప్పటికప్పుడు జేసీ రాహుల్‌మీనా, డీఎస్వో సత్యనారాయణరాజు సమీక్షిస్తున్నారు.

బాలల వసతిగృహాల్లో సౌకర్యాలు కల్పించాలి: జేసీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోఉన్న బాలల సంరక్షణ వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని జేసీ రాహుల్‌మీనా ఆదేశించారు.కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం బాలల సంరక్షణ వసతి గృహాల పరిశీలన కమిటీ తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తొలి విడతగా రిజిస్ట్రేషన్ చేసుకున్న 24బాలల సంరక్షణ వసతిగృహాలకుగాను 17 వసతిగృహాలు కొనసాగడానికి అనుమతులు ఇచ్చామన్నారు. దీనిలో రెండు వసతిగృహాలను వివిధ కారణాలవల్ల తిరస్కరించామన్నారు. మరో ఐదు వసతిగృహాలు పోలీసు దర్యాప్తులో ఉన్నాయన్నారు. కమిటీలో ఉన్న అధికారులు జిల్లాలో నడుస్తోన్న ఈ వసతిగృహాలను విధిగా తనిఖీ చేయాలని ఆదేశించారు. బాల బాలికలకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించాలన్నారు. జువెనైల్ జస్టిస్ యాక్ట్ సెక్షన్ 41 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోకుండా బాలలతో వసతిగృహాలు నడుపుతున్న స్వచ్ఛంద సంస్థలు ఎవరైనా ఉంటే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ లక్ష్మీ, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ వి.మాధవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకట్రావు, ప్రొటెక్షన్ అధికారి విజయ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సంతోషి, అధికారులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కాకినాడ-సికింద్రాబాద్ రైల్వే సర్వీసు పొడిగింపు

- కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాకినాడ-సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలు సర్వీసులను వచ్చేఏడాది మార్చి వరకు పొడిగించినట్లు ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ వెల్లడించారు. కాకినాడలో గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజల అభ్యర్థన మేరకు సికింద్రాబాద్‌కు నడుస్తున్న ప్రత్యేక రైల్వే సర్వీసును పొడిగించాలని గత జూన్ 19న దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు లేఖ రాశామన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన అధికారులు ప్రస్తుతం వారానికి మూడురోజులు కాకినాడ నుంచి లింగంపల్లి వరకు నడుస్తున్న ప్రత్యేక రైలుతోపాటు అదనంగా ప్రతి శనివారం కాకినాడనుంచి చర్లపల్లికి ప్రత్యేక రైలు సర్వీసులు కేటాయించారన్నారు.

మాజీ ఎమ్మెల్యే వర్మకు భద్రత

- ఇద్దరు గన్‌మేన్‌లను కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం

పిఠాపురం,సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మకు ప్రభుత్వం భద్రత కల్పించింది. ఇద్దరు గన్‌మేన్‌లను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా వారు గురువారం వర్మను కలిసి విధుల్లో చేరారు. ఎన్నికల ముందు కూటమి పొత్తులో భాగంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గంనుంచి పోటీ చేయడంతో వర్మకు ఎమ్మెల్సీతోపాటు ఉన్నతమైన పదవి ఇస్తామని సీఎం చంద్రబాబు హామీఇచ్చారు. అప్పటి నుంచి పదవి రాలేదు. అయినప్పటికీ వర్మ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిణామాలు, ఇతరత్రా పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా వర్మకు భద్రత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తమ నేతకు మంచి పదవి లభిస్తుందని టీడీపీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విశాఖపట్నం-కాకినాడ పెట్రోలియం అథారిటీ అభివృద్ధికి ప్రణాళిక

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-కాకినాడ పెట్రోలియం కెమికల్స్, పెట్రోకెమికల్స్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అభివృద్ధికి అవసరమైన బృహత్తర ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో విశాఖపట్నం-కాకినాడ పెట్రోకెమికల్స్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సమావేశం గురువారం జరిగింది. అథారిటీ చైర్మన్ కేఎస్ విశ్వనాథ్ విశాఖపట్నం నుంచి వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఈ అథారిటీ జిల్లాలో తొండంగి, యు.కొత్తపల్లి, కాకినాడ రూరల్ మండలాల పరిధిలో 15 గ్రామాల్లో విస్తరించి ఉందన్నారు. కాకినాడ జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న ప్రాజెక్టు పురోగతి, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక రూపకల్పన చేపట్టాలన్నారు. ప్రణాళిక తయారీకి ఆయా శాఖల అధికారులు వివరాలు సకాలంలో ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా అథారిటీ చైర్మన్ కేఎస్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఏపీ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం-2016 ప్రకారం వీసీపీఐఆర్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రాంతానికి 30ఏళ్ల ప్రత్యేక ప్రణాళిక రూపకల్పనకు శ్రీకారం చుట్టిందన్నారు. దీనిప్రకారం విశాఖపట్నం-కాకినాడ పెట్రోలియం కెమికల్స్, పెట్రో కెమికల్స్ ఇన్‌వెస్ట్‌మెంట్ రీజియన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పెర్స్పెక్టివ్ ప్లాన్ 2051, ఆధునికీకరించిన డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ 2041, డెవలప్‌మెంట్ ప్లాన్ 2041 తయారీకి కార్యాచరణ చేయాలన్నారు. ఈ అథారిటీ విశాఖపట్నం, కాకినాడ, అనకాపల్లి జిల్లాలో 640 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 10మండలాల్లో విస్తరించిందన్నారు. దీనిలోభాగంగా తొలి సమావేశం నిర్వహించామన్నారు. జేసీ రాహుల్ మీనా, డీఆర్వో వెంకట్రావు, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, పరిశ్రమలశాఖ జీఎం గణపతి, సీపీవో త్రినాథ్, పాడా పీడీ చైత్రవర్షిణి పాల్గొన్నారు.

జిల్లాలో యూరియాపై సూక్ష్మ ప్రణాళిక రూపకల్పనకు వివరాల సేకరణ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ మండలాల్లో యూరియా ఏ మేరకు అవసరం ఉందో తెలియజేయాలని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు విజయ్‌కుమార్ ఆదేశించారు. ఈమేరకు ఆయన కాకినాడ తన కార్యాలయంనుంచి గురువారం వివిధ మండలాల ఏడీఏలు, ఏవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల్లోఉన్న రైతు సేవా కేంద్రాల పరిధిలో ఏఏ పంటలు సాగుచేశారు. ఇప్పుడు ఆ పంటలు ఏ దశలో ఉన్నాయి, ఏ మేరకు యూరియా, ఇతర ఎరువులు చల్లారు వంటి వివరాలను కోరారు. దీనిపై సమగ్రమైన సూక్ష్మ ప్రణాళికను రూపొందించుకుంటున్నామని తెలిపారు. ఈనెల 6న జిల్లాకు వచ్చే 1800 మెట్రిక్ టన్నుల యూరియాను తాను రూపొందించుకున్న ప్రణాళికను అనుసరించి ఆయా మండలాలకు సరఫరా చేస్తామన్నారు. జిల్లాలో యూరియా కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు యూరియా ప్రతిరైతుకు అందే చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అక్రమ నిల్వలపై దాడులు చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ ఆదేశాలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యూరియా అక్రమ నిల్వలపై దాడులు చేయాలని, యూరియా సక్రమంగా రైతులకు సరఫరా చేయాలని సీఎస్ విజయానంద్ ఆదేశించారు. అమరావతి నుంచి గురువారం వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సమృద్ధిగా యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. యూరియా బ్లాకు మార్కెటింగ్ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని జిల్లాలకు ఖరీఫ్ సీజన్‌లో సరిపడా యూరియా సరఫరా చేస్తామన్నారు. భూగర్భ జలాలు పెంచడానికి ఉపాధిహామీ నిధులతో గుంతలు తవ్వించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో సౌరశక్తిని ప్రోత్సహించేందుకు పీఎం కుసుమ పథకం అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛత అవార్డులకు సంబంధించిన నామినేషన్లు త్వరితగతిన పంపించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, భూగర్భజలశాఖ, ఇరిగేషన్, విద్యుత్ శాఖ పాల్గొన్నారు.

7న తునిలో జాబ్‌మేళా

గోడ పత్రిక ఆవిష్కరించిన కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):ఈనెల 7నతుని పెంటకోటరోడ్డులోఉన్న ఆర్‌వీవీఎస్‌జేఆర్‌బీజడ్‌పీపీ బాలికల ఉన్నతపాఠశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళా గోడపత్రికను కలెక్టర్ షాన్‌మోహన్ గురువారం ఆవిష్కరించారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. టెన్త్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ చదివిన అభ్యర్థులు హాజరుకావాలి. అధికారులు మాగాపు కొండలరావు, కిరణ్, శ్రీనివాసు పాల్గొన్నారు.


ఎల్ఆర్ఏటీ ఏజీపీగా అద్దేపల్లి నియామకం

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ నాలుగో అదనపు జిల్లా కోర్టులో భూసంస్కరణల అప్పిలేట్ ట్రిబ్యునల్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా అద్దెపల్లి మురళీధర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈమేరకు రాష్ట్ర న్యాయశాఖ గురువారం జీవో ఆర్‌టీ నెంబరు 345ను జారీ చేసింది.

బీచ్‌రోడ్డులో రేపటి వరకు రాకపోకల బంద్

కొత్తపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పిఠాపురం సీఐ ఆదేశాల మేరకు ఈనెల 4నుంచి 6వరకు వినాయకవిగ్రహాల నిమ్మజ్జనం కార్యక్రమాల దృష్ట్యా బీచ్‌రోడ్డు లో రాకపోకలను నిలిపివేస్తున్నామని కొత్తపల్లి ఎస్‌ఐ జి.వెంకటేష్ తెలిపారు. ఉప్పాడ, కాకినాడ మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు పిఠాపురం మీదుగా వెళ్లాలని ఎస్‌ఐ వెంకటేష్ విజ్ఞప్తి చేశారు.


కన్నతండ్రే కాలయముడు


హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.


ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. నగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుదిశ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

బోధన.. విలక్షణంగా..

బోధన అంటే ఆశువుగా పాఠం చెప్పడమే అనే అర్థం మారిపోయింది. భట్టీపడితే ఈరోజు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారనుకోవడం భ్రమ. కష్టపడి చదవడం కాదు.. ఇష్టపడి చదవాలనే కాలమిది. పాఠ్యాంశాలను అర్థం చేసుకుని, తమదైన జ్ఞానాన్ని ఆపాదిస్తేనే విద్యకు సరైన పరమార్థం దక్కుతుంది. మరి ఆ మార్గంలో పయనించాలంటే గురువు చేసే దిశానిర్దేశమే కీలకం. అందుకే నేటితరం ఉపాధ్యాయులు బోధనలో కొత్త పద్ధతులను అనుసరిస్తున్నారు. ఏవిధంగా బోధిస్తే విద్యార్థులు అందిపుచ్చుకుంటారనే ఆలోచనతో నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నారు. అలాంటి వారిలో కొందరి గురించి..

కృత్యాధార బోధనే ఆయన ప్రత్యేకత

అనపర్తి ఉపాధ్యాయుడు శ్రీనివాస్ వినూత్న బోధన


చిన్నారులకు కృత్యాధార బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్

బోధన అంటే పుస్తకంలోని పాఠాలను పిల్లలకు నూరిపోసేయడమే అనే రోజులు పోయాయి. భట్టీపట్టి పాస్ అయితే పై తరగతులకు వెళ్లాక ఫెయిల్ కొట్టడం ఖాయం. దీంతో ఉపాధ్యాయులు బోధించే విషయంలో అనేక వినూత్న పద్ధతులను అనుసరిస్తున్నారు. మరీ ముఖ్యంగా కొందరు ఉపాధ్యాయులు తమదైన శైలిలో బోధన చేస్తూ పాఠ్యాంశాల పట్ల ఎంతో ఆసక్తిని కలిగిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలోని మార్కెండేయపురంలోని మండల పరిషత్ పాఠశాలలో రెండో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు నీలా శ్రీనివాస్ వినూత్నంగా పాఠాలు బోధిస్తూ అటువంటి ప్రయత్నమే చేస్తున్నారు. అక్కడ పిల్లలు పాఠం వినడం కాదు.. ఆడుతూ పాడుతూ నేర్చుకుంటున్నారంటే అక్కడ బోధన స్పెషాలిటీ అర్థమవుతుంది. డిజిటల్ ఇంటరాక్టివ్ బోర్డు మీద గేమ్స్ ఆడుతూ లెక్కలు చెప్పడం, తెలుగు పదాలను వాక్యాలుగా మార్చడం, ఇంగ్లీషు అక్షరాలను ఓ పాట మాదిరిగా బోధించడం చేస్తున్నారు. 1998లో ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన శ్రీనివాస్ కొత్త పద్ధతుల్లో బోధన చేసేందుకు నిరంతరం తపన పడతారు. దీనిలో భాగమే ఆట- పాట- మాట- కృత్యం. పిల్లలు ఒత్తిడి లేకుండా నేర్చుకోవాలి. పాఠశాల అంటే చిన్నారులకు ఆటస్థలం అనిపించాలి. అందుకే ఈ విధానాన్ని బోధనలో భాగం చేశానంటారు శ్రీనివాస్. ఆటలోనే పాఠం నేర్పడం, పాటల రూపంలో పదాలు, అక్షరాలు చెప్పించడం, మాటలతో చర్చలు, గ్రూప్ వర్క్ చేయించడం, కృత్యం ద్వారా పాఠాన్ని ఆచరణలోకి తీసుకురావడమే తన కర్తవ్యంగా శ్రీనివాస్ బోధిస్తారు. శ్రీనివాస్ అవలంబిస్తున్న విధానాలను తెలుసుకునేందుకు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విద్యాశాఖాధికారులు ఆయన పనిచేస్తున్న పాఠశాలను సందర్శించి అభినందిస్తుంటారు. **- ఆంధ్రజ్యోతి, అనపర్తి**

ఓ అధ్యాపకుడి చేయూత

ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్ అభివృద్ధికి పాల్‌రాజు ప్రత్యేక కృషి



తరగతి గదిలో విద్యాబోధన చేస్తున్న పాల్‌రాజు

గురువంటే విద్యాబోధన చేయడమే కాదు.. తాను పనిచేస్తున్న పాఠశాల అభివృద్ధికి ఆర్థిక చేయూత అందిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేవారూ ఉంటారు. కందుకూరి పాల్‌రాజు కూడా అలాంటి వారిలో ఒకరు. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో పాల్‌రాజు జువాలజీ అధ్యాపకునిగా విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నారు. ఈయన ఏ స్కూల్లో పనిచేసినా విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా సరళీకృతంగా పాఠాలు బోధించడం, ఆంగ్లంలో కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం చేస్తుంటారు. ఏపీఎస్పీ హైస్కూల్‌ని గతేడాది ప్రభుత్వం బాలికల హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియెట్ తరగతులు నిర్వహిస్తోంది. ఇంటర్ కోసం నిర్మించిన అదనపు తరగతుల భవనాలు, గోడలకు పెయింటింగ్స్ లేక విద్యార్థులు అసౌకర్యానికి గురవడాన్ని గుర్తించారు. రూ.30 వేల సొంత డబ్బులతో ఇంటర్ ప్రథమ, ద్వితీయ తరగతి గదులు, మీటింగ్ హాల్, బయట బాల్కనీ గోడలకు పెయింటింగ్స్ వేయించారు. ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం పేరెంట్స్ ఇళ్లకు వెళ్లి ఫస్టియర్‌లో ఈ ఏడాది 63 మంది విద్యార్థులు చేరేలా కృషిచేశారు. రెండేళ్లుగా కాలేజీలో అడ్మిషన్ల కోసం రూ.50 వేలు వెచ్చించి ఆటోల ద్వారా ప్రచారం చేయించారు. పాల్‌రాజు ఏమంటున్నారంటే.. కార్పొరేట్ కాలేజీలకు దీటుగా పరిసరాల పరిశుభ్రత, ఆహ్లాద వాతావరణం, ఆసక్తి కలిగేలా బోధన చేస్తే వారిలో ఉన్న నైపుణ్యాలను వెలికితీసి, మంచి ఫలితాలు సాధించవచ్చు.

- ఆంధ్రజ్యోతి, సర్పవరం జంక్షన్



ఎల్‌డీ పేట ప్రాథమిక పాఠశాలలో నాణేలతో బోధన చేస్తున్న అర్జునరావు మాస్టారు →

అణగనగా ఒక నాణెం..

పురాతన నాణేలతో పాఠం చెబుతూ..

అణా...పరకా.. బేడా ఇవేంటి అనుకొంటున్నారా.. ఇవి మనవాళ్లు వాడిన పురాతన నాణేలు. సుమారు నాలుగు దశాబ్దాల కిందట వరకు చలామణీలో ఉండేవి. ఈ పురాతన నాణేలను సేకరించిన కాకినాడ జిల్లా కోటనందూరు మండలం ఎల్‌డీ పేట ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వాటితోనే బోధన చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఆయన పేరు పంచాడ అర్జునరావు. ఈ పాఠశాలలో ఆయన ప్రధానోపాధ్యాయుడిగా ఉన్నారు. మన దేశంలో పూర్వం వాడిన నాణేలను సేకరించడం చాలామంది చేస్తుంటారు. అలాగే వివిధ దేశాల కరెన్సీని, గాంధీజయంతి నాడు ముద్రించిన ప్రత్యేక నోట్లను సేకరించడం మరికొందరి హాబీ. అర్జునరావు మాస్టారు 2002 నుంచి విద్యార్థులకు ద్రవ్యం గురించి పాఠశాలు చెప్పడం కోసం నాణేల సేకరణ చేయడం ప్రారంభించారు. రెండు దశాబ్దాలకు పైగా కోటనందూరు, పాతకొట్టాం, కొత్తకొట్టాం, ఎల్‌డీపేట పాఠశాలల్లోని విద్యార్థులకు ఇలాంటి నాణేలతో బోధించడం అందరికీ సుపరిచితమే. పూర్వం నుంచి ఉన్న నాణేలతో ద్రవ్య చరిత్ర వివరించడం, పాత నోట్లు ఎలా చలామణీ అయ్యావో సవివరంగా తెలియజెప్పడం చేస్తుంటానని అర్జునరావు చెప్పారు.

- ఆంధ్రజ్యోతి, కోటనందూరు



మొక్కల సంరక్షణను వివరిస్తున్న టీచర్ విష్ణుప్రియ.. లెర్నింగ్ మెటీరియల్‌తో పాఠాలు బోధిస్తున్న దృశ్యం

'నేచురల్' స్టడీ

వినూత్న విద్యాబోధన ఆమె ప్రత్యేకత

లెర్నింగ్ మెటీరియల్‌తో పాఠాలు

పాఠశాల మైదానంలో జీవశాస్త్ర ప్రయోగాలు

విద్యార్థులకు వినూత్న రీతిలో పాఠాలు చెప్పేందుకు ప్రయత్నిస్తుంటారు కొందరు ఉపాధ్యాయులు. ఎలా చెబితే విద్యార్థుల బుర్రల్లోకి విషయం చేరుతుందో ఆ విధంగా విద్యా బోధన చేసేందుకు తపన పడుతుంటారు. కేవలం తరగతి గదిలో క్లాసులు చెప్పడమే కాదు.. పుస్తకాల్లోని అంశాలను ప్రాక్టికల్‌గా చేసి చూపడం కొందరి ఉపాధ్యాయుల ప్రత్యేకత.. అలాంటి వారిలో బొల్లు విష్ణుప్రియ కూడా ఒకరు. ప్రస్తుతం శ్రీనగర్ మున్సిపల్ హైస్కూల్లో (ఇంగ్లిష్ మీడియం) ఆమె ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు బయాలాజికల్ సైన్స్ సబ్జెక్టును బోధిస్తున్నారు. 15 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న విష్ణుప్రియ కాకినాడ రమణయ్యపేట, గొడారిగుంట మున్సిపల్ హైస్కూళ్లల్లోనూ పనిచేశారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌తో పాఠాలు బోధిస్తూ.. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. జీవం, జీవుల శాస్త్రీయ అధ్యయనం, వాటి నిర్మాణం, పనితీరు, పెరుగుదల, మూలం, పరిణామం జీవావరణ శాస్త్రం, జంతు, వృక్ష, జీవ రసాయన శాస్త్రాలు, బయోటెక్నాలజీ, సూక్ష్మ జీవశాస్త్రం వంటి అనేక అంశాలను ప్రయోగాత్మకంగా చేసి చూపిస్తూ విద్యార్థులకు తరగతి గదిలోనే కాదు.. స్కూలు ఆవరణలోనూ పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. అంతేకాదు పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేస్తూ విద్యార్థులతో స్వయంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. వాటి సంరక్షణ బాధ్యతలను కూడా వారే చేపట్టేలా విద్యార్థుల్లో చైతన్యం తీసుకొస్తున్నారు. తాను ఏ పాఠశాలలో పనిచేసినా బయాలాజికల్ సైన్స్‌లో విద్యార్థులు అధిక మార్కులు తెచ్చుకోవడంలో ఆమె కృషి చేస్తున్నారు. తరగతి గదిలో ఏ పాఠం చెప్పబోతున్నారో ఆ పాఠ్యాంశానికి సంబంధించిన లెర్నింగ్ మెటీరియల్‌ను ముందుగానే సిద్ధం చేసుకుని అందరికీ అర్థమయ్యే రీతిలో ప్రాక్టికల్‌గా విషయ పరిజ్ఞానాన్ని వివరించడం విష్ణుప్రియ ప్రత్యేకత.

- ఆంధ్రజ్యోతి, కాకినాడ




కొడుకు మోహిత్‌సూర్య నోటు పుస్తకాన్ని పరిశీలిస్తున్న ఉపాధ్యాయుడైన తండ్రి నాగేంద్రగౌడ్.. రాజువైరు పాఠశాలలో పిల్లలు కార్తీక, హారికలతో ఉపాధ్యాయుడైన తండ్రి సూర్యనారాయణ.. భట్లపాలెం ప్రాథమిక పాఠశాలలో సత్యానందరావు, యజ్ఞకుమారి దంపతుల పిల్లలు శ్రీనందన, శ్రీనందకుమార్

ఆదర్శ ఉపాధ్యాయులు!

పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ..

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించుకుంటున్నారని విమర్శలు ఎన్నో ఉన్నాయి. అందుకు భిన్నంగా వీరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించారు. అమలాపురంరూరల్ మండలం ఇందుపల్లి శివారు భట్లపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కొవ్విల వెంకట నాగేంద్రగౌడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తన కుమారుడైన శ్రీమోహిత్‌సూర్యను అదే పాఠశాలలో చేర్పించి ఐదో తరగతి విద్యార్థులతో కలిపి ఆయనే పాఠాలు చెబుతున్నారు. ఇక రాజువైరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కుంచెం సూర్యనారాయణ ఉపాధ్యాయుడు. అదే పాఠశాలలో ఆయన పెద్ద కుమార్తె సత్యకృష్ణకార్తీక 4వ తరగతి, హారిక 2వ తరగతి చదువుతున్నారు. ఏకోపాధ్యాయ పాఠశాల కావడంతో మిగిలిన పిల్లలతో కలిసి తన కుమార్తెలకు ఆయనే పాఠాలు చెబుతున్నారు. అమలాపురం రూరల్ మండలం బండారులంకకు చెందిన బళ్ల సత్యానందరావు, ములికి యజ్ఞకుమారి దంపతులిద్దరూ ఉపాధ్యాయులే. యజ్ఞకుమారి ప్రస్తుతం రావులచెరువు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయిని. ఇక సత్యానందరావు తాను ఎనిమిదేళ్లపాటు బండారులంక వల్లూరివారిపేట ప్రాథమిక పాఠశాలలో పనిచేశారు. కుమార్తె లక్ష్మీవిశాల శ్రీనందన, కుమారుడు విజయ్‌శ్రీనందకుమార్‌లకు 5వ తరగతి వరకు తాను పనిచేసిన పాఠశాలలోనే చేర్పించి చదివించారు. అదే గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పిల్లలిద్దరు 8వ తరగతి చదివారు. వారిద్దరు ప్రస్తుతం పెద్దాపురం నవోదయ పాఠశాలలో చదువుకుంటున్నారు. **- ఆంధ్రజ్యోతి, అమలాపురం రూరల్**


గురుభ్యో నమః


డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పెయింటింగ్ చిత్రం

అమలాపురం రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఏటా సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటాం. ఆయన ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి రాష్ట్రపతిగా ఎంతో ఉన్నత స్థానానికి ఎదిగారు. దీనిలో భాగంగా పాలగుమ్మి జడ్పీ హైస్కూల్‌కు చెందిన చిత్రలేఖనం ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహచంద్ర కుమార్ తన అభిమానాన్ని చాటుకుంటూ వినూత్నంగా బ్లాక్ షీట్‌పై తెలుగు రంగు మాత్రమే ఉపయోగించి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని గీశారు. ఆ చిత్రం విశేషంగా ఆకట్టుకుంటోంది.

ఆవగింజలతో సర్వేపల్లి చిత్రం

● 2025 గింజలను ఉపయోగించి తయారు చేసిన రాజారావు




రాజారావు, చిత్రకారుడు

ఆలమూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా మాజీ రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రాన్ని ఆవగింజలతో తయారుచేశారు. ఆలమూరు మండలం కొత్తూరు శ్రీవిద్యా పబ్లిక్ స్కూల్‌లో ఉపా. ధ్యాయుడిగా పనిచేస్తున్న యర్లగడ్డ రాజారావు మూడురోజుల పాటు శ్రమించి 2025 ఆవగింజలను ఉపయోగించారు. ఈయన అనేక మంది ప్రముఖుల చిత్రపటాలను తయారు చేయడంలో నేర్పరి. అతన్ని పలువురు అభినందించారు.

తెలుగు టీచర్ సృజన .. అక్షర రూపంలో


అక్షర రూపంలో గీసిన చిత్రపటం

రాయవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీచర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని అక్షర రూపంలో గీసి రాయవరం మండలం వెదురుపాకకి చెందిన తెలుగు టీచర్ డాక్టర్ చిర్రా వెంకట మోహన్ అభిమానాన్ని చాటుకున్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాధాకృష్ణన్ జననం, బాల్యం, విద్యాభ్యాసం, పదవులు, పురస్కారాలు, బిరుదులు, తదితర అంశాలను ఈ చిత్రపటంలో పొందిపర్చానని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా నివాళి అర్పించినట్టు చెప్పారు.

600 కిలోల గంజాయి పట్టివేత


తాళ్లపూడి పోలీస్ స్టేషన్ వద్ద గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

తాళ్లపూడి, సెప్టెంబరు 4 (ఆంధ్రజోతి): తాళ్లపూడి మండలం మలకపల్లి వద్ద గురువారం 600 కిలోల గంజాయిను పోలీసులు పట్టుకున్నారు. విశాఖ జోనల్ యూనిట్ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులకు టీఎస్69 ఏఎం 4777 నెంబర్ గల ఇన్నోవా వాహనంలో గంజాయి వస్తుందనే సమాచారం అందడంతో వెంబడించారు. దీంతో కొవ్వూరు టోల్‌గేటు వద్దకు వచ్చేసరికి నిందితులు తప్పించుకుని పారిపోతుండగా మలకపల్లి వద్ద పోలీసులు అటకాయించారు. గంజాయిని తరలిస్తున్న వారిలో ఇద్దరు కారు దిగి పారిపోగా, పట్టుబడ్డ మహరాజన్ రాజాను విచారణ నిమిత్తం తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. కాగా, కారును పరిశీలించగా మొత్తం 292 గంజాయి ప్యాకెట్లు లభ్యమవగా, వాటి విలువ రూ. మూడు కోట్ల వరకు ఉండొచ్చని అధికారులు గుర్తించారు. ఈ మేరకు నిందితుడ్ని, వాహనాన్ని రాజమహేంద్రవరం తరలించి, అక్కడ పూర్తి సమాచారం అందిస్తామని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు పేర్కొన్నారు.

నారసింహా... పాహిమాం

● అంతర్వేది పుణ్యక్షేత్రంలో ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు
● స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు


ఆలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు


ప్రత్యేక పవిత్రాల అలంకరణలో స్వామి-అమ్మవార్లు

అంతర్వేది, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో స్వయంభూగా వెలిసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో గత నాలుగు రోజులుగా స్వామివారి పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గురువారం ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలను అర్చకులు నిర్వహించారు. పూర్ణాహుతితో స్వామివారి పవిత్రోత్సవాలు పరిపూర్ణమయ్యాయి. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అభిషేకం, అలంకార తిరుమంజనం, ప్రాయశ్చిత హోమం, మహాశాంతి హోమం, పరమాత్మికోపనిషత్తు, శేష హోమం, 12 గంటలకు పూర్ణాహుతి పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. సాయంత్రం కంచు గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం గ్రామ పురవీధుల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. పవిత్ర అవరోహరణ, విశేషార్చన, నీరాజన మంత్రపుష్పాలు, పవిత్రముల వినియోగం జరిగింది. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడడంతో అన్నదానంలో అధిక సంఖ్యలోభక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజాకలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, ఆలయ ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్, అహోబిలం దేవస్థాన సభ్యులు, జంపన బుజ్జిరాజు, మధురాజు, చంటిరాజు, నల్లా ప్రసాద్, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, గొట్టుముక్కల భీమరాజు, తదితరులు పాల్గొన్నారు.


స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వీరికే..

దివాన్‌చెరువు, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజిమెంట్ స్టడీస్ ప్రొఫెసర్ పీ.ఉమామహేశ్వరిదేవి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2025కు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ గురువారం తెలిపారు. దీనికి సంబంధించి ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగే కార్యక్రమంలో సీఎం నుంచి ఉమామహేశ్వరిదేవి అవార్డు అందుకుంటారని తెలిపారు. నన్నయలో ఆమె మేనేజిమెంట్ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తూ విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ డైరెక్టర్‌గా, ఉమెన్‌సెల్ కోఆర్డినేటర్‌గా సేవలందిస్తున్నారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, విభాగాధిపతి ఆచార్య ఎన్.ఉదయభాస్కర్ తదితరులు ఉమామహేశ్వరీదేవికి అభినందనలు తెలిపారు.

ఇద్దరు పీఆర్ అధ్యాపకులకు..

కాకినాడరూరల్: కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల్లో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న ఇద్దరు అధ్యాపకులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పురస్కారాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల ఆంజనేయులు తెలిపారు. కళాశాల కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన డాక్టర్ కె.లక్ష్మణ్, అదేవిధంగా భౌతికశాస్త్ర విభాగానికి చెందిన డాక్టర్ కె.జయదేవ్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారన్నారు. విజయవాడలోని ఏ1 కన్వెన్షన్‌లో శుక్రవారం జరిగే గురుపూజోత్సవ వేడుకల్లో సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నుంచి అవార్డులను అందుకోనున్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: రాజమహేంద్రవరంలోని శ్రీ కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో సంస్కృత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పీ.శ్రీవల్లి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. రాజమండ్రి వాస్తవ్యురాలైన శ్రీవల్లి 2011 నుంచి సంస్కృత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ... ప్రస్తుతం కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అకడమిక్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. 2001లో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎంఏ సంస్కృతం పట్టా, 2009లో తిరుపతి ఆర్ఎస్ విద్యాపీఠం నుంచి సంస్కృతంలో పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. విశాఖపట్నం ఆల్ ఇండియా రేడియో నుంచి విద్యార్థులకు సంస్కృతంలో తరగతులు నిర్వహిస్తున్నారు.

పవన్ ఉపాధ్యాయ దినోత్సవ కానుక

● రెండువేల మంది ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లకు చీరలు, ప్యాంట్లు, షర్టులు


టీచర్లకు కానుకలను అందజేస్తున్న డిప్యూటీ సీఎం పేషీ అధికారులు

పిఠాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన కానుకతో ఉపాధ్యాయలోకం మురిసిపోయింది. వివరాల్లోకి వెళితే.. పిఠాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న రెండు వేల మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులకు తన ఓఎస్‌డీలు, పేషీ అధికారుల ద్వారా పవన్ దుస్తులు పంపించారు. వీటిని విద్యార్థుల చేతులమీదుగా వారికి అందజేయించారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో గల అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, కళాశాలల్లోని అధ్యాపకులకు ఒకరోజు ముందే ఉపాధ్యాయ దినోత్సవం వచ్చినట్టయ్యింది. వీరందరికీ పవన్ ప్రత్యేకంగా కానుకలు పంపారు. గురువారం ఉదయమే డిప్యూటీ సీఎం పేషీ అధికారులు వీటిని తీసుకుని నియోజకవర్గానికి వచ్చారు. మహిళా ఉపాధ్యాయులకు చీరలు, పురుషులకు ప్యాంట్లు, షర్టులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పేషీ అధికారులు శివకుమార్, నాగబాబు, శ్రీనివాస్, గొల్లప్రోలు, పిఠాపురం ఎంఈవోలు వెంకట శివప్రసాద్, శ్యామ్‌బాబు, నారాయణదాసు, హెచ్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

గణేశుడి నిమజ్జనాల్లో ఘర్షణలు

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం బీ.కొత్తూరులో గురువారం జరిగిన వినాయక నిమజ్జనం ఘర్షణకు దారి తీసింది. బాణసంచా కాల్చే సమయంలో నిప్పు రవ్వలు కొందరిపై పడ్డాయి. దీంతో అదే సమయంలో అన్నదానం జరుగుతుండటం వల్ల ఇరువర్గాలు వాగ్వావాదానికి దిగాయి.అది చిలికిచిలికి గాలివానలా మారి తీవ్రమై ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో ఒక వర్గానికి చెందిన చెల్లి గణేష్, బాబీ, చంటమ్మకు, మరో వర్గానికి చెందిన చినబాబు, మాగాపు శ్రీనుకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పిఠాపురం, కాకినాడ ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. పిఠాపురం రూరల్ పోలీసులకు ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

అల్లవరం: కొమరగిరిపట్నం గుర్రంవారి వీధి గణేష్ నిమజ్జన ఊరేగింపులో గురువారం రాత్రి అపశృతి చోటుచేసుకుంది. ఓ యువకుడు కత్తితో పొడవగా ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఉప్పలగుప్తం మండలం చీకట్లపాలేనికి చెందిన యువకుడు కత్తితో పొడవగా కొమరగిరిపట్నానికి చెందిన సుంకర రమేష్, కొమ్మూరి శంకర్ గాయపడినట్టు సమాచారం. విషయం తెలుసుకున్న అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ బి.సంపత్‌కుమార్ హుటాహుటిన వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఉద్రిక్త పరిస్థితుల నడుమ ఊరేగింపు అర్థంతరంగా ఆగిపోయింది. సీఐ ఆదేశాల మేరకు కొమరగిరిపట్నంలో పోలీసు పికెట్‌ను ఏర్పాటుచేశారు.

రైస్ పుల్లింగ్ ముఠా గుట్టురట్టు

» కాకినాడలో పురాతన నాణేల పేరుతో ఘరానా మోసం
» ఐదుగురు నిందితుల అరెస్ట్
» నకిలీ ప్రాచీన నాణాలు, ప్లేటు, ధ్రువ పత్రాలు, రబ్బరు స్టాంపులు స్వాధీనం
» ఎస్పీ బిందుమాధవ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన కాలంనాటి అతి విలువైన, అరుదైన వస్తువులు, పురాతన అంతర్జాతీయ నాణాలు ఉన్నాయని వాటిని అమ్మితే బయట మార్కెట్‌లో ధర కోట్లలో ఉంటుందని అమాయక ప్రజలను నమ్మించి ధనార్జన చేస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను కాకినాడ టూటౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ జి.బిందుమాధవ్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బుధవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా కాకినాడ, గాంధీనగర్ పార్క్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. కాకినాడ సూర్యనారాయణపురానికి చెందిన షేక్ సర్దార్ అలియాస్ గుణ అలియాస్ గుణశేఖర్, అలియాస్ మహేశ్వరరెడ్డి, రామారావు పేటకు చెందిన పడాల వెంకటరమణ, విశాఖపట్నానికి చెందిన దువ్వు రాజశేఖర్, పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన జమ్ము లక్ష్మీదుర్గ, తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన కండవల్లి శ్రీనులుగా గుర్తించారు. ఈ ఐదుగురు మధ్యతరగతి చెందిన అమాయకులను ఎంచుకుని వారి వద్దకు వెళ్లి తమకు అమృత ట్రస్ట్ అనే అనాథ శరణాలయం ఉందని, దాని నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని, వాటిని పేద విద్యార్థులకు, వృద్ధులకు, రోగులకు, అనాథలకు అన్‌లైన్ అకౌంట్స్ తెరచి కొంత డబ్బును ప్రజలకు ఇస్తామని నమ్మించే వారు.అయితే ప్రాచీన, విలువైన, అరుదైన వస్తువులు తమ వద్ద ఉన్నాయని, వాటిని బహిరంగ మార్కెట్లో అమ్మితే కోట్లలో డబ్బులు వస్తాయని, వాటిని కొనుగోలు చేస్తే తక్కువ రేటుకు పురాతన వస్తువులు రావడంతో పాటు తమ ద్వారా పేదలకు, అనాథలకు సహాయం చేసిన వారవుతారని నమ్మించి సొమ్ములు కాజేసేవారు. అయితే వీరు ప్రాచీన నాణాలు, ప్లేట్లు నకిలీవి తయారు చేయించే వారు. వాటికి లేపనం చేసి నిజమైన వాటిగా రైస్ పుల్లింగ్ పరీక్షను, నీడిల్ పరీక్షను, ఉజాల పరీక్షను చేశారు. వాటిని అమ్మడానికి వారే పార్టీలను రప్పించే వారు.వారి వద్ద అమాయక ప్రజలతో కొనుగోలు చేయించి సొమ్ములు కాజేసేవారన్నారు.షేక్ సర్దార్ అమృత ట్రస్ట్ మేనేజర్‌గా, దువ్వు రాజశేఖర్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా, కండవల్లి శ్రీను సెకండ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా వ్యవహరిస్తూ తప్పుడు పత్రాలను సృష్టించి, వారి హోదాలకు సంబంధించి స్టాంప్స్‌ను తయారు చేసి ప్రజలను నమ్మించే వారు. ప్రజలకు ఆన్‌లైన్‌లో అకౌంట్స్ ఓపెన్ చేస్తామని ఒక్కో అకౌంట్‌కు రూ.13 వేలు వసూలు చేసి ట్రస్ట్ నుంచి కోట్ల రూపాయలు ఆ అకౌంట్స్‌లో పడతాయని చెప్పే వారు. వచ్చిన నగదును బ్యాగ్‌లలో భద్రపర్చి ఓ ఇంట్లో తాళం వేసి అమౌంట్ ప్రాసెసింగ్‌లో ఉందని నమ్మించి బ్యాగ్‌లు ఓపెన్ చేయనీయకుండా, అకౌంట్స్ ఇంకా ప్రాసెసింగ్‌లో ఉన్నాయని, కొంత డబ్బు అవసరమని నమ్మించి ప్రజల నుంచి నేరుగా జమ్ము లక్ష్మీదుర్గ అకౌంట్‌కు డబ్బులు వేయించుకుని మోసం చేసేవారు. నిందితుల వద్ద నుంచి 6 నకిలీ ప్రాచీన నాణాలు, ఒక నకిలీ ప్రాచీన ప్లేటు, 4 నకిలీ ధ్రువపత్రాలు, 2 నకిలీ రబ్బరు స్టాంపులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు, క్రైం సీఐ వి.కృష్ణ బృందాలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కాకినాడ ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్, ఎస్పీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న నకిలీ వస్తువులు

ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్‌గా రమణ


జీవీ రమణను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాకా రమణగా సుప్రసిద్ధులైన, రాజమహేంద్రవరం ఆర్ట్స్ క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్(రాకా) కార్యదర్శి జీవీ రమణ, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు 25మందితో పాలక వర్గ జాబితాను ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఇరిగేషన్ శాఖలో ఉద్యోగిగా పనిచేసి ఆ తరువాత రాకా సాంస్కృతిక సంస్థ స్థాపనలో కీలక పాత్ర వహించారు. అధ్యక్షుడిగా ప్రముఖ వైద్యుడు కంటే వీరన్నచౌదరి, తాను కార్యదర్శిగా పలు సాంస్కృతిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 1987 ఆకాశవాణి కేంద్రంలో డ్రామా ఆర్టిస్ట్‌గా ఎంపికై పలు రేడియో నాటికలు వేయడంతో పాటు రంగస్థలం మీద కూడా ఇండియా ఫర్ సేల్, దేశంలో దొంగలు పడ్డారు లాంటి పలు నాటికలు, సామాజిక స్పృహ కలిగిన రేడియో నాటికలు రాసారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో ఆయనకు ఉన్న అనుబంధం విడదీయరానిది. ఔత్సాహిక గాయకుడిగా పలు గీతాలు ఆలపించారు. 2019లో ధవళేశ్వరంలో పద్మశ్రీ ఘంటసాల విగ్రహ స్థాపనకు కృషి చేశారు. ఇటీవల ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేయించారు. స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని వీరన్నచౌదరి హాస్పిటల్ ఆవరణలోని బాలు స్మారక మందిరంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమణ మాట్లాడుతూ నాటక అకాడమీ తరపున చేయాల్సిన కార్యక్రమాలను చిత్తశుద్ధితో చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు సత్కరించారు. కార్యక్రమంలో తిరుమల కృష్ణమోహన్, సూరపరెడ్డి తాతారావు, భమిడిపాటి రామకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్

వైపీ పాలెంలో యువకుడి ఆత్మహత్య


తోరం సాయి(ఫైల్)

పి.గన్నవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లో డబ్బును పోగొట్టి.. భయంతో 19 ఏళ్ల యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం వైపీ పాలెంలో జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తోరం శ్రీనివాసరావు జీవనోపాధి నిమిత్తం ఆటోను కొనేందుకు ఇంట్లో ఉన్న బంగారాన్ని ఈ నెల 1న స్థానిక ప్రైవేటు ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టారు. తాకట్టులో వచ్చిన రూ.1.25 లక్షల సొమ్మును తన కుమారుడు సాయి ఖాతాలోకి జమ చేయించాడు. అయితే ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ఉన్న సాయి తన ఖాతాలో ఉన్న సొమ్ము బెట్టింగ్‌లో పోగొట్టాడు. దీంతో తండ్రి మందలిస్తాడెమోనన్న భయంతో అదే రోజు మధ్యాహ్నం ఏటిగట్టుపైకి వెళ్లి పురుగులు మందు తాగేశాడు. చావు భయంతో బెట్టింగ్ విషయం, పురుగులు మందు తాగిన విషయం ఫోన్‌లో తన తండ్రికి, స్నేహితులకు వివరించాడు. దీంతో వారు హుటాహుటిన సాయి ఉన్న ప్రదేశానికి చేరుకుని తొలుత కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రావులపాలెం అక్కడ నుంచి అమలాపురం తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లావారుజామున మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మృతుడు మేనమామ దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు.

ట్రాక్టరు తిరగబడి కూలీ మృతి


ప్రమాదంలో మృతిచెందిన గోవిందు



ముమ్మిడివరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఐరన్ ఊసల లోడుతో వెళుతున్న ట్రాక్టరు ట్రక్కు తిరగబడడంతో ఆ ట్రాక్టరుపై ఉన్న వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన ముమ్మిడివరం మండలం అయినాపురం ఏటిగట్టుపై గురువారం జరిగింది. అయినాపురం ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం నుంచి మురమళ్ల ట్రాక్టరు ట్రక్కుపై ఇనుప ఊసలు తరలిస్తుండగా ట్రక్కుపై యానాం వెంకటన్‌నగర్ శివారు కురసంపేటకు చెందిన కూలీ మేడిశెట్టి గోవిందు (48) కూర్చొన్నాడు. ఏటిగట్టుపై వెళుతుండగా ట్రాక్టరుకు సడన్ బ్రేక్ వేయడంతో ట్రక్కు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ట్రక్కుపై ఉన్న గోవిందు కింద పడగా అతనిపై ఇనుప ఊచలు పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. కాగా గోవిందుకు భార్య రమాదేవి, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గోవిందు కూలీ పని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తుంటాడు. గోవిందు మృతితో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నాటు తుపాకీతో వ్యక్తి అరెస్ట్

గోకవరం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): నాటు తుపాకి కలిగి ఉన్న వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్టు గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. గోకవరం మండలం జగన్నాథపురం శివారున ఉన్న కోళ్ల ఫారమ్‌లో ఒక వ్యక్తి నాటు తుపాకీ కలిగి ఉన్నాడని తిరుమలాయపాలెం ఫారెస్ట్ సెక్షన్ అధికారి అమలదాసు భాస్కరకృష్ణ ఫిర్యాదు చేశారన్నారు. దర్యాప్తులో భాగంగా తుపాకీ కలిగిప యమల నాగబాబు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండు నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

రేపటి నుంచి అమెరికామెడీ నాటికలు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 6, 7 తేదీల్లో కాకినాడ దంటు కళాక్షేత్రంలో అమెరికామెడీ నాటికలు ప్రదర్శించనున్నారు. అమెరికా హాస్యబ్రహ్మ వంగూరి చిట్టెన్ రాజు రచించిన ఐదు హాస్య నాటికల బ్రోచర్‌ను ప్రముఖ రచయిత, యూట్యూబర్ రవి మంత్రి గురువారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొంటున్న ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణికి జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేయనున్నట్టు వంగూరి ఫౌండేషన్ అధ్యక్షుడు చిట్టెన్ రాజు తెలిపారు. నాటక రంగ నిపుణులు ఆచార్య బీవీ రమణమూర్తి, ఆచార్య డీఎస్ఎన్ మూర్తిలకు ఆత్మీయ సత్కారం చేయనున్నట్టు దంటు భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో మార్ని జానకిరామచౌదరి, ప్రభుదాసు,కట్టా కృష్ణారావు, బాలాంత్రపు సుచిత్రామూర్తి పాల్గొన్నారు.

అద్దంపల్లి - యర్రపోతవరం రోడ్డులో దోపిడీ

వ్యక్తిని గాయపరచి బంగారం, నగదు, స్కూటీ పట్టుకుపోయిన దొంగలు

కె.గంగవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అద్దంపల్లి-యర్రపోతవరం రోడ్డు లో బుధవారం రాత్రి దోపిడీ జరిగిందని ఎస్.ఐ ఎస్‌కే జానీబాషా చెప్పారు. ద్రాక్షారామ గ్రామా నికి చెందిన దినేష్‌కు ద్రాక్షారామ, యానాంలో తాకట్టు, బంగారం విక్రయ దుకాణాలున్నాయి. అతడి వద్ద పనిచేసే యండమూరి శ్రీనివాసు యానాంలోని షాపును నిర్వహిస్తున్నాడు. శ్రీని వాసు ద్రాక్షారామ నుంచి రోజూ యానాం వెళ్లి వ్యాపారం చూసుకుని రాత్రి ఇంటికి తిరిగి వస్తుంటాడు. వచ్చేటప్పుడు యానాం షాపులో పనిచేస్తున్న అద్దంపల్లికి చెందిన విశ్వనాధం బుల్లియ్యను అద్దంపల్లిలో దింపి ద్రాక్షారామ వెళు తుంటాడు. ఈ క్రమంలో బుధవారం అద్దంపల్లి నుంచి యర్రపోతవరం వస్తుండగా ఆటోలో వ చ్చిన దుండగులు శ్రీనివాసును గాయపరచి 12 గ్రాముల బంగారం, రూ.5 వేలు రొక్కం, స్కూ టీ, పద్దుల పుస్తకాలు పట్టుకుని వెళ్లిపోయారు. దీనిపై శ్రీనివాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

7న భావనారాయణస్వామి ఆలయం మూసివేత

సర్పవరంజంక్షన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడరూరల్ సర్పవరంలో ఉన్న శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయం చంద్రగ్రహణం కారణంగా ఈనెల 7వ తేదీ మధ్యాహ్నం 12నుంచి 8ఉదయం 10గంటల వరకు ఆలయం మూసివేయనున్నట్లు ఈవో తలాటం సూర్యనారాయణ ఓప్రకటనలో పేర్కొన్నారు. చంద్రగ్రహణం అనంతరం ఆలయ పూజారుల ఆధ్వర్యంలో స్వామివారికి సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించామన్నారు.

మైనార్టీ వృత్తిదారులకు ప్రధాని విశ్వకర్మ పథకం రుణ సదుపాయం

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద మైనార్టీ వర్గాలకు చెందిన చేతివృత్తిదారులకు రుణసదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వాహణ సంచాలకులు ఎం.సునీల్‌కుమార్ ఒకప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆధార్, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం, బ్యాంక్ పాస్‌బుక్ కలిగి ఉండాలని, వయస్సు 18 సంవత్సరాలు నిండాలన్నారు. ఇంతకుముందు ఎటువంటి ప్రభుత్వ రుణం పొంది ఉండకూడదన్నారు. అర్హతగల వృత్తిదారులు తమ దరఖాస్తులను సంబంధిత సేవా కేంద్రాలు, సీఎస్సీ కేంద్రాల ద్వారా www.pm vishwakarma.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ఆప్కో బకాయిల చెల్లింపులపై ఏడీకి వినతి

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా చేనేత సహకార సంఘాల ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయి. ఆప్కో లేవరీ వస్త్రాల విక్రయాలపై దాదాపు పది నెలలుగా బకాయిలు చెల్లించకపోవడంతో సంఘాలవద్ద నగదు పరపతులు ఖాళీ అయ్యాయి. కొన్ని సంఘాలకు కోటి రూపాయల వరకు ఆప్కో బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని సొసైటీ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం చేనేత జౌళిశాఖ కార్యాలయంలో ఏడీ పెద్దిరాజుకి ఆప్కోస్ బకాయిలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తూర్పుగోదావరిజిల్లా చేనేత సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పర్యవేక్షణ

కాకినాడసిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని వార్ఫ్‌రోడ్ బ్రహ్మంగారి మఠం, వినాయకసాగర్, జవహర్ జెట్టివద్ద శుక్ర, శనివారాల్లో జరుగనున్న గణేష్ నిమజ్జన ఏర్పాట్లను కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు గురువారం కాకినాడ అర్బన్ తహసీల్దార్ వి.జితేంద్ర, పెదపూడి తహసీల్దార్ పీవీ సీతాపతిరావు, కార్పొరేషన్ హెల్త్ఆఫీసర్ పృథ్వీచరణ్, ఒన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాదరావు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఆర్డీవో మల్లిబాబు మాట్లాడుతూ నిమజ్జన ప్రదేశాలలో తగిన ఏర్పాట్లుచేయాలని కార్పొరేషన్, పోలీస్ అధికారులకు సూచించారు. విద్యుత్, తాగునీరు, బారీ కేడింగ్, క్రేన్‌లతోపాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు.


కూరాడలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయులకు ఘన సత్కారం

కరప, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కరప మండలం కూరాడ మోడల్ ప్రైమరీ స్కూల్‌లో గురువారం ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైవీఎల్ఎన్ భాసుప్రకాష్, ఉపాధ్యాయులు గీత అనసూయ, పీవీవీ రమణ, లోవదుర్గ, శ్రీలక్ష్మిలను స్కూల్ విద్యాకమిటీ, తల్లిదండ్రులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. గ్రామంలో పాఠశాలలకు, పంచాయతీ, అంగన్‌వాడీ, సొసైటీ భవనాలకు, కుళాయి ట్యాంక్‌కు కోట్లు విలువచేసే భూములను దానమిచ్చిన కూరాడ సొసైటీ చైర్మన్ వెలుగుబంట్ల సూరిబాబును కూటమి నాయకులు, ఉపాధ్యాయులు సత్కరించి వారి పూర్వీకులు గ్రామానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు టేకుమూడి సాయిరాం, పంపన హరిబాబు, గుబ్బల శ్రీనివాసరావు, వెలుగుబంట్ల గంగాధర్, స్వామి, చోడిశెట్టి ప్రసాద్, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

పీఆర్‌లో గురుపూజోత్సవ వేడుకలు

కాకినాడరూరల్(ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ హరిరాంప్రసాద్ అధ్యక్షతన గురుపూజోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గతంలో కళాశాలలో అధ్యాపకులుగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన పలువురు అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సంజీవ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గురువులకు పాదపూజ

పిఠాపురం(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని బుధవారం ముందస్తుగా నిర్వహించారు. భాష్యం స్కూలులో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వేషధారణలో విద్యార్థులు అలరించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు తమ తమ ఉపాధ్యాయులకు పాదపూజ చేసి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ హెచ్ఎం అరుణ పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా నలుగురి ఎంపిక

సామర్లకోట(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు సామర్లకోట మండలం జీ.మేడపాడు గాంధీగ్రామ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కంటి పూడి గోపాలకృష్ణ, ఉండూరు ప్రకాశరావుపేట మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు కెఎంఎంఆర్. ప్రసాద్, బోయినపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.కామేశ్వరరావు, సామర్లకోట పట్టణానికి చెంది బ్రౌన్‌పేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వీరన్నలు ఎంపికయ్యారని సామర్లకోట మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య గురువారం రాత్రి వెల్లడించారు.


డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాకినాడరూరల్లో ఇద్దరికి అవార్డు

సర్పవరం జంక్షన్(ఆంధ్రజ్యోతి): గురు పూజోత్సవం పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను ప్రకటించింది. వీరిలో కాకినాడ రూరల్ మండలం సర్పవరం హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ (పీఈ)గా పని చేస్తున్న చార్లెస్ రాజుబాబు, ఏపీఎస్పీ ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్‌కు చెందిన సెకండరీ గ్రేడ్ టీచర్ సిస్ట శ్రీవెంకట చలపతి లు ఇద్దరు ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు.

నేడు జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సూరిబాబు ప్రమాణస్వీకారం



సామర్లకోట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):కాకినాడజిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వల్లూరి సూర్యప్రకాశ రావు(సూరిబాబు) శుక్రవారం ఉదయం అచ్చంపేటలో గల లక్ష్మీపరిణయ ఫంక్షన్ హాలులో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇందుకు సంబంధించి రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారంరాత్రికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలోని రైస్‌మిల్లర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలో సూరిబాబుకు మిల్లర్ల ఆదరాభిమానాలు ఉన్నాయి.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పిస్తాం

● మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

పెద్దాపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 4వ తేదీన సీఎం ఆదేశించినా పేరు తో ప్రచురితమైన కథనంపై ఆయన గురువారం స్పందించారు. మెప్మా గ్రూపులద్వారా పట్టణ ప్రజలకు వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. దీనిలోభాగంగా మెప్మా గ్రూపు సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. పెద్దాపురంలో 17482 కుటుంబాలు ఉండగా 1056 డ్వాక్రా సంఘాలు ఉన్నాయని, ఎస్‌హెచ్‌జీ సంఘాల ద్వారా మూడువేల కుటుంబాలకు అవగాహన కల్పిస్తామన్నారు. రాబోయే 10రోజుల్లో మిగిలిన కుటుంబాలకు అవగాహన కల్పిస్తామని, ప్రతీనెలా 5,6 తేదీల్లో అవగాహన ర్యాలీ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే దీనిపై మున్సిపల్ ఆర్డీ నాగనరసింహారావు స్పందిస్తూ వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించనున్నట్లు తెలిపారు.

'పంచాయతీలు ఆర్థిక పరిపుష్టి చెందాలి'

పెద్దాపురం, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలు ఆర్థిక పరపుష్టిని సాధించాలని తద్వారా గ్రామాల అభివృద్ధి జరుగు తుందని ఎంపీడీవో డి.శ్రీలలిత అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ (పీఏఐ) నిర్వహించిన వర్క్‌షాప్ కార్యక్రమంలో ఆమె పాల్గొని గురువారం మాట్లాడారు. పీఏఐ 1.0నుంచి 2.0వరకూ పరివర్తన వ్యాప్తిపై సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. పంచాయతీల పనితీరు మెరుగుపరచడానికి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ, మెరుగైన గ్రామీణపాలన, పర్యవేక్షణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ ఎంపీడీవో శేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ సతీష్‌బాబుతోనే గుర్తింపు

● టీడీపీ నాయకుడు సత్యనారాయణ


సత్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

సామర్లకోట, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కుమ్మరి కార్పొరేషన్ డైరెక్టర్‌గా తనను సీఎం చంద్రబాబు ఎంపిక చేయడంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కృషి ఉందని సీనియర్ టీడీపీ బీసీసెల్ నాయకుడు భీమాబత్తుల సత్యనారాయణ పేర్కొన్నారు. రాష్ట్ర కుమ్మరి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియామకం అయిన అనంతరం గురువారం సాయంత్రం సామర్లకోట మండలం కొప్పవరం గ్రామంలో ఎంపీ సతీష్‌బాబు క్యాంపు కార్యాలయానికి డైరెక్టర్ సత్యనారాయణ ఎంపీ సతీష్‌బాబుకు ఫోన్‌ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జున్నూరు బాబ్జీ, ఐటీడీపీ సతీష్, అనిల్, కాకర పల్లి చలపతిరావు, చింతపల్లి అర్జున్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, ఆనంద్‌న్యూటన్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.49,998 విరాళం

సామర్లకోట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):సామర్లకోట కుమార రామభీమేశ్వరాలయంలో దేవదాయశాఖ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయ్‌కు చెందిన సోనాల్ ఆహుజా గురువారం ఆలయ ఈవో బళ్ళ నీలకంఠంనకు రూ.49,988ల నగదు విరాళాన్ని అందజేశారు. ముందుగా దాత సోనాల్ ఆహుజాకు వేదపండితులచే స్వాగతం పలికి స్వామి,అమ్మవార్ల దర్శనాలు చేయించి నంది మండపంవద్ద వేదపండితులచే వేదాశీర్వచనంతో ప్రసాదాలు, స్వామి,అమ్మవార్ల చిత్రపటాన్ని ఈవో నీలకంఠం అందజేశారు.

నగరాభివృద్ధే ధ్యేయంగా పాలన: ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికిగురైన రోడ్లపై నేడు కూటమి ప్రభుత్వం కొత్త రోడ్లను వేస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. దుమ్ములపేట నుంచి కుంభాభిషేకం రహదారి వరకు నిర్మిస్తున్న రోడ్లను గురువారం ఎమ్మెల్యే, కార్పొరేషన్, కోస్ట్‌గార్డ్ అధికారులు, కేఎస్పీఎల్ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో కాకినాడ నగరంలో రోడ్లు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. ప్రస్తుతం ఈ ప్రధాన రహదారిలో గోతులు పూడ్చి కొత్తరోడ్డు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేఎస్పీఎల్ ప్రతినిధి జాకబ్, కార్పొరేషన్, కోస్ట్ గార్డ్ అధికారులు, స్థానిక నాయకులు తుమ్మల రమేష్, చోడిపిల్లి సతీష్, అల్లం రాజు, మూగు రాజేష్, ఎరుపిల్లి రాము, ఎలిపే శ్రీనివాస్, మోసా పేతూరు, అర్జిల్ల దాసు, చీకట్ల ఆనంద్ పాల్గొన్నారు.

రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి కృషి

రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. స్థానిక దేవాలయంవీధిలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కొండబాబు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్‌గా వెత్సా మురళి, ధర్మకర్తల మండలి సభ్యులుగా ప్రగలపాటి అరుణ్‌కుమార్, చిరుకూరి శ్రీనివాసరావు, ఓలేటి సత్య, వంకాయల కృష్ణ, మందపాటి సూర్యనారాయణ మూర్తి, చోడిపల్లి సత్యవతి, పి.లక్ష్మి, ఎ.మధుశ్రీ, ఎం.దీప్తి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ నారాయణం మురళి, గ్రంధి నారా యణరావు (బాబ్జి) బచ్చు శేఖర్, గదుల సాయిబాబు, పల్లా సురేష్ పాల్గొన్నారు.


నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న కొండబాబు

మేథస్సును ఉపయోగించి విజయాలను సొంతం చేసుకోవాలి

● కేఎస్ఈజెడ్ హెడ్ లక్ష్మీనారాయణ

కొత్తపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యువతీ, యువకులు మేథస్సును ఉపయోగిస్తూ విజయాలను సొంతం చేసుకొనే విధంగా ప్రణాళికలను రూపొందించుకోవాలని కాకినాడ సెజ్ హెడ్ లక్ష్మీనారాయణ అన్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్ నిత్యానందరెడ్డి ఆదేశాల మేరకు సెజ్ ప్రాంతగ్రామాల్లో యువతీ యువకులకు సాధికారత కల్పించేందుకు మూలపేటలో నిర్వహి స్తున్న డబ్ల్యుఎస్‌డీసీ, ప్రతిభ కేంద్రాలద్వారా శిక్షణ పూర్తి చేసుకు న్న 89 మంది యువతీ, యువకులకు ఆయన సర్టిఫికెట్లను గురువారం పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత నగరాల్లో ఉండే యువతతోపాటు పోటాపోటీగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొనే విధంగా అరబిందో ఫార్మాఫౌండేషన్ అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో శిక్షణ ఇవ్వడం అభినందనీయ మన్నారు.

బ్రిడ్జి అప్రోచ్‌రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

గొల్లప్రోలు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణ శివారులోని కాలనీకి సుద్దగడ్డ కాలువపై నిర్మించిన బ్రిడ్జికి అప్రోచ్‌రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. రూ.2కోట్ల తో బ్రిడ్జి నిర్మించినా అప్రోచ్‌రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో ఇటీవల వచ్చిన సుద్దగడ్డ వరదల సమయంలో కొత్తకాలనీకి రాకపోకలు నిలిచిపోయాయి. బ్రిడ్జికి నిచ్చెనలు ఏర్పాటుచేసుకుని కాలనీవాసులు రాకపోకలు సాగించారు. వీరి ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి వీలుగా ముందుగా గ్రావెల్‌వేసే పనులు ప్రారంభించారు.

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ రామారావుపేట ప్రాంతం షాపు నెంబరు 23లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నూతనంగా క్యూఆర్ కోడ్‌తో ముద్రించిన స్మార్ట్ రైస్‌కార్డులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తుందని మంచి ప్రభుత్వంగా ప్రజలు ఆశీర్వదించాలన్నారు. రేషన్‌షాపు డీలర్ అరుణాకరరావు, మాజీ కార్పొరేటర్ జీవీఎస్ శర్మ, కందాల రవి, జంపన రమణయ్య, రాజు, జ్యోతుల రాజేష్ పాల్గొన్నారు.

ఛలో విజయవాడను విజయవంతం చేయాలి

● ఎస్ఎఫ్ఐ నాయకులు

పిఠాపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6వ తేదీన భారత విద్యార్థి ఫెడరేషన్ చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దు కోరారు. పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో నాయకులతో కలిసి పోస్టర్లు విడుదల చేశారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాలల యజమాన్యాలు చెబుతుండటంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఉన్నతవిద్య, ఉద్యోగావకాశాలను కోల్పోతున్నారని తెలిపారు. వసతిగృహాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. విద్యార్థులంతా ఈ కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ గరల్స్ విభాగం జిల్లా కన్వీనర్ జి.చిన్ని, నాయకులు సుకుమార్, కరుణాకర్, లక్ష్మణ్, దుర్గాజీ పాల్గొన్నారు.

కృష్ణకార్తీక్ సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీగా జేఎన్టీయూకే ఆమోదం



జేఎన్టీయూకే,సెప్టెంబరు4(ఆంధ్ర జ్యోతి): నిపుణుల బృందం సిఫార్సుల మేరకు మందపల్లి కృష్ణకార్తీక్ సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీగా జేఎన్టీయూకే ఆమోదముద్ర లభించినట్లు రిజిస్ట్రార్,పీఆర్వో ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. కృష్ణకార్తీక్ తన సిద్ధాంతవ్యాశాన్ని వర్శిటీలోని యూసీఈకే రసాయనశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.సత్యవేణి, సూరంపాలెంలోని ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల పరిశోధనాభివృద్ధి డీన్, రసాయనశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పీవీఎస్ మాచిరాజు పర్యవేక్షణలో సమర్పించారన్నారు. కృష్ణకార్తీక్ ప్రస్తుతం అమలాపురంలోని చెయ్యేరులో గల శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ రసాయనశాస్త్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కాకినాడ సిటీ, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల వివిధ సమస్యలు పరిష్కరించాలని ఏపీఎన్జీవోస్ నేతలు కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాద పూర్వ కంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఎన్జీవోస్ నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మట్టపర్తి వెంకటేశ్వరరావు, వెంకటకృష్ణ, మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, చార్లెస్ పాల్, సిటీ అధ్యక్షుడు అరదాడి సత్తిరాజు పాల్గొన్నారు.

పోలీస్ క్యాంటీన్ ప్రారంభం


క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బందికి కావాల్సిన అన్నిరకాల గృహోపయోగ వస్తువులను అందుబాటులోకి తీసుకు వచ్చిన కొత్త సబ్సిడీ క్యాంటీన్‌ను కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, ఎస్పీ జి.బిందుమాధవ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. పాత ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ క్యాంటీన్‌లో ఎయిర్ కండీషనర్లు, ఫ్రిజ్‌లు, మిక్సీలు, గ్రైండర్‌లు, ఫ్యాన్‌లు, ఇతర నిత్యావసర గృహోపకరణాలు, అలాగే పోలీస్ సిబ్బంది యూనిఫామ్‌కు అవసరమైనవి రాయితీ ధరలలో లభిస్తాయని ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్‌మనీష్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వరరాగసుధ సప్తవాయిద్య సమ్మేళనానికి విశేష స్పందన

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ సూర్యకళామందిరంలో 131వ గణపతి సంగీత హరికథా నాటక మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. గతనెల 27నుంచి ఈనెల 4వతేదీ వరకు శ్రీరామ సమాజం ఆధ్వర్యంలో జరిగాయి. చివరిరోజు గురువారం స్వరరాగసుధ సప్తవాయిద్య సమ్మేళనం ఆహుతులను అలరించింది. సప్తవాయిద్య సమ్మేళనంలో విద్వాన్ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి వైలన్, విద్వాన్ భైరవభట్ల సుబ్రహ్మణ్యశర్మ వేణువు, కొక్కొండ సూర్యసుబ్రహ్మణ్యం వీణ, బందరు వీరబాబు క్లారినెట్, కోటిపల్లి సూరిబాబు మృదంగం, అనిపిండి అనిల్‌కుమార్ ఘటం, తెలుగు పవన్‌కుమార్ కంజీర తమ వాయిద్యం నైపుణ్యంతో అనేక కీర్తనలతో భక్తులను ఆకట్టుకున్నారు.

గణపయ్యకు బెల్లంతో అలంకరణ



కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో దేవదాయ ధర్మాదాయశాఖ కార్యాలయం వద్ద సంపత్ వినాయకుడి ఆలయంలో గురువారం దేవదాయశాఖ జిల్లా అధికారి కనపర్తి నాగేశ్వరరావు, ఈవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుమారు అరటన్నుకుపైగా బెల్లంతో అలంకరించారు. స్వామివారిని పంచామృతాలతో అభిషేకించిన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు సమర్పించిన సుమారు 600కిలోలకు పైగా బెల్లంతో స్వామివారిని అలంకరించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఈ తోట దుర్గేష్, డీఈ, ఏఈలతోపాటు ఈవోలు, అధిక సంఖ్య లో భక్తులు పాల్గొన్నారు.

వినాయకుడికి మాజీ ఎమ్మెల్యే వర్మ పూజలు


పూజలు నిర్వహించి విరాళం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాలవద్ద నిలిపిన వినాయక మండపాలను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సందర్శించి పూజలు నిర్వహించారు. అక్కడ జరిగిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాల్లో పాల్గొని విరాళాలు అందజేశారు. జైగణేష్ ఆలయంలో జరిగిన ఇరుముడిధారణ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా సతీష్, పాదగయ మాజీ చైర్మన్ కొండేపూడి సూర్యప్రకాష్, నాయకులు సోము సత్యనారాయణ, కొరుప్రోలు శ్రీను, అల్లవరపు నగేష్, కోళ్ల బంగారుబాబు, సందిన నందిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కార్యాలయంలో గణపతి పూజలు

సామర్లకోట(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రులు పురష్కరించుకుని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు క్యాంపు కార్యాలయం కొప్పవరంలో గురువారం రాత్రి గణపతి హోమపూజలు ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన వినాయక పందిరిలో జరిగిన హోమపూజలలో క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి, అరిగెల శ్రీనివాసరావు, కోటిపల్లి సతీష్, సంగాడి వీరబాబు,లు పాల్గొన్నారు. పండితులు చావలి సాంబశివ తేజశర్మ నేతృత్వంలో పలువురు వేదపండితులు శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్ఛారణల మధ్య హోమపూజలు చేసారు. అనంతరం పెద్దఎత్తున ప్రసాదవితరణ చేసారు. ఈ పూజలలో జున్నూరు బాబ్జీ, ముత్యాల అనిల్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, బర్ల శ్రీనివాసు, ఐటీడీపీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గణపతికి ఎమ్మెల్యే రాజప్ప పూజలు

సామర్లకోట, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణ పరిధిలో ఇండస్ట్రీయల్ ఎస్టేట్ ఆవరణలో ఏర్పాటుచేసిన గణపతి నవరాత్రుల ఉత్సవపందిరి వద్ద గణపతికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పారిశ్రామికవేత్త గోపాలకృష్ణ దంపతుల సౌజన్యంతో ఎస్టేట్ ఆవరణలో గణపతి నవరాత్రి ఉత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తూ వేలాదిమంది భక్తులకు ప్రసాద వితరణలు చేస్తున్న గోపాలకృష్ణ దంపతులను ఎమ్మెల్యే చినరాజప్ప అభినందించారు.

ఘనంగా లక్ష్మీగణపతి హోమం

కరప, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మెరక వీధి హంసగుడివద్ద ఉన్న గణనాధుడి మండపంలో గురువారం లక్ష్మిగణపతి హోమం, సరస్వతిదేవి పూజలు ఘనంగా జరిగాయి. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు దంపతుల ఆధ్వర్యంలో రుత్వికులు స్వామివారికి పలు పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు, విద్యార్థులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించగా పలువురు భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

మహిళల అభ్యున్నతే గ్రామాల అభివృద్ధి

శంఖవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలు అభివృద్ధి చెందడం ద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని డీఆర్‌డీఏ, వెలుగు ప్రాజెక్టు డైరెక్టరు బి.శ్రీనివాస్ అన్నారు. గురువారం వేళంగి, అనుమర్తి గ్రామాల్లో ఆయన పర్యటించి గిరిజన మహిళలతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో చిన్నస్థాయి వ్యాపారాలు, వృత్తి ఆధారిత పనులతో ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. డీపీఎం విభిరాయ్, కేశవ్, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు రాజబాబు, లత, రమణ పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మళ్లీ పెరుగుతున్న గోదావరి..ప్రజల ఆందోళన

కూనవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో మళ్లీ గోదావరి వరద ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నది. మరోసారి కూనవరం-భద్రాచలం రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలో పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోగా, ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

వైభవంగా వినాయకుని నిమజ్జనం

విఆర్‌పురం, సెప్టెంబరు. 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనాలను గురువారం వైభవంగా నిర్వహించారు. విఆర్‌పురంలోని వీడియో కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడిని ఊరేగింపు అనంతరం నిమజ్జనం చేశారు. మండల కేంద్రంతో పాటు రాజుపేట తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను శబరి నదిలో నిమజ్జనం చేశారు.

ఆకట్టుకున్న మహిళల కోలాటం

వై.రామవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వై.రామవరం బస్ సెంటర్‌లోని కోదండ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడిని గురువారం నిమజ్జనం జరిపారు. మహిళా కమిటీ సభ్యులు మడకం రామలక్ష్మి ఆధ్వర్యంలో దేవరమడుగుల పెద్దేరు వాగులో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. సీఆర్‌పీఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో వినాయకుని నిమజ్జనం చేశారు.

బైబై...వినాయక

దేవీపట్నం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో పాముగండి, చొప్పకొండ, వి.రామన్నపాలెం, డీఎస్‌పాలెం, ఇందుకూరుపేట, ఇందుకూరు, శరభవరం, దేవారం, ఇందుకూరు 1 ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, మంటూరు, ఏనుగులగూడెం, అగ్రహారం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను గ్రామాల్లో ఊరేగించి దండంగి వద్ద గోదావరి, ముసురుమిల్లి ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు.

అడ్డతీగల, (ఆంధ్రజ్యోతి): మండలంలో గణేష్ నిమజ్జనాలు ఘనంగా జరిపారు. గంగవరం మండలం జడేరు గ్రామానికి చెందిన యువత వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా ఆయా వీధుల్లో ఊరేగించి అడ్డతీగల శివారులో ఉన్న మద్దిగెడ్డ జలాశయంలో నిమజ్జనం చేశారు.

ఆలయంలో గణపతి హోమం

మోతుగూడెం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో గురువారం లక్ష్మీ గణపతి ఆలయంలో గణపతి నవరాత్రుల సందర్భంగా హోమం నిర్వ హించారు. ముందుగా మూలవిరాట్ కు ప్రధాన అర్చకుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ విత్తనాల సత్యనారాయణ దంపతులు, జెన్కో ఉద్యోగస్తులు చంద్రశేఖర్ దంపతులు, వ్యాపారవేత్త మొవ్వ సందీప్ దంపతులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి మెట్లరేవు ఏర్పాటు

చింతూరు, సెప్టెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): ఆయుర్వేద నిపుణుడు, జేకే సీటీ చైర్మన్ జమాల్‌ఖాన్ మత సామరస్యాన్ని చాటుకున్నారు. వినాయక చవితి సందర్భంగా గణేష్ నిమజ్జన ఏర్పాట్లు చింతూరు లో జరుగుతున్నాయి. శబరి వద్దకు చేరుకొనే మెట్లరేవు పూర్తిస్థాయిలో మరమ్మతుకు గురైంది. దీంతో భక్తులు నదిలోకి జారిపడే ప్రమాద ముందన్న విషయం ఆయన దృష్టికి కొందరు తీసుకెళ్ళారు. దీనికి ఆయన స్పందిస్తూ తన సొంత ఖర్చులతో గురువారం మెట్ల రేవుని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్కే. రియాజ్, సమీర్, అబ్రార్ ఖాన్, షాజహాన్, సమీర్, గఫర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణం

రంపచోడవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలకు రూ.25 లక్షల అంచనాతో ప్రహరీ పనులను గురువారం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, ఎంపీటీసీ వంశీ కుంజం, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ దమంతు సుందర్‌సింగ్, తహసీల్దారు బాలాజీ, ప్రిన్సిపాల్ కె.కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఎటపాక, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి నష్టం కలిగించే రీతిలో కేంద్రం ఇటీవల పత్తి దిగుమతి సుంకాలను తగ్గించడాన్ని వ్యతిరేస్తూ గురువారం సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంద ఆధ్వర్యంలో సరిహద్దు ప్రాంతంలోని దమ్మక్కపేటలో కేంద్ర దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం డివిజన్ నాయకులు సాయన్న మాట్లాడారు. కార్యక్రమంలో రాజు ద్రౌపతి, నర్సింహారావు, భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు


చింతూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా కోసం ఆందోళన పడవద్దని చింతూరు ఐటీడీఏ పీఓ శుభం నొఖ్వాల్ అన్నారు. గురువారం పీఓ చింతూరులోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దుకాణదారులకు, రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రత్నప్రభ, సీఐ చిత్రాడ గోపాలకృష్ణ, ఎస్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతారహితంగా వ్యవహరించడం సరికాదు

రంపచోడవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల అధికారులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని భారత కమ్యూనిస్టు డివిజన్ కార్యదర్శి జుత్తుక కుమార్ అన్నారు. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వివిధ పాఠశాలల విద్యార్థులను ఆయన గురువారం పరామర్శించారు. మహిళా సమాఖ్య నాయకులు గోము దుర్గ, దినేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రాణాలు పణంగా పెట్టి....

• ముంపు గ్రామాల్లో వైద్య సేవలు శ్లాఘనీయం • వరద నీటిలో కాలి నడకన కొందరు • నాటు పడవలపై మరికొందరు



చింతూరు ఏరియా ఆసుపత్రికి గర్భిణిని పడవపై తరలిస్తున్న ఆశావర్కర్లు

చింతూరు, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి) ఎటు చూసినా వరద నీరే .. నడుమ గ్రామాలు .. అక్కడకు చేరు కోవాలంటే నాటు పడవలే దిక్కు .. కొన్ని గ్రామాలకు చేరు కోవాలంటే ఒకటి నుంచి రెండు కిలోమీటర్ల మేర పడవలపై ప్రయాణించాల్సిందే. ఇటీవల ఎడతెరిపి లేకుండా మన రాష్ట్రంతో పాటు ఎగువనున్న ఛత్తీస్‌గడ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలలో కురుస్తున్న వర్షాలతో చింతూరు డివిజనులోని గోదావరి, శబరి నదులతో పాటు పలు వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. గడచిన పద్దెనిమిది రోజులుగా గోదావరి, శబరి నదులు తగ్గుతూ పెరుగుతూ ఉన్నాయి. దీంతో డివిజను పరిధిలోని దాదాపు 80 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో లోతట్టు వాసులు అనేక అవస్థలు పడుతున్నారు రహదారులు మూసుకుపోవడంతో ఆసుపత్రులకు వెళ్ళే పరిస్థితి లేకుండా పోయింది. వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు జ్వర పీడితులు నాటు పడవలపై ప్రయాణం చేయలేని స్థితి నెలకొంది. దీంతో వైద్య బృందాలే నాటు పడవలపై ముంపు గ్రామాలకు చేరుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రాణాలకు తెగించి వైద్య సిబ్బంది ముంపు గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలు శ్లాఘనీయమన్న అభిప్రాయాలు వెలువడు తున్నాయి. వారిలో కొందరు వరద నీటిలో తలపై మందుల బాక్సులు మోసుకుంటూ కాలినడకన ముంపు గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందిస్తుండగా మరి కొందరు నాటు పడవలపై రెండు నుంచి మూడు కిలోమీటర్ల మేర ప్రయాణించి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక ఆయా గ్రామాల్లో గర్భిణీ లను గుర్తించి సురక్షిత ప్రాంతాలలో ఉన్న ఆసుపత్రులకు పడవలపై తరలిస్తున్నారు. ఇంటింటి సర్వేలు, వైద్య శిబిరాలు జోరుగా నిర్వహిస్తున్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఘనంగా గణనాథుల నిమజ్జనం

● గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు





తొండంగి: నిమజ్జనానికి గణేష్ విగ్రహాన్ని తరలిస్తున్న దృశ్యం, ఏలేశ్వరంలో గణపతిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

కోటనందూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గణనాథుల నిమజ్జనం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో గణనాథులను ప్రతిష్ఠించి నవరాత్రులను వైభవంగా నిర్వహించారు. గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో గణనాథులను భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లి కాల్వలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

గండేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం గణనాథుల నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. మల్లేపల్లి, నీలాద్రిరావుపేట గ్రామాల్లో గణనాథులను డప్పు వాయిద్యాలు, తీన్మార్, బాణసంచా కాలుస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

కిర్లంపూడి, (ఆంధ్రజ్యోతి): జగపతినగరం కొత్తపేటలో గద్వాల్ యూత్ ఆధ్వర్యంలో గణపతి పందిరి వద్ద గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. పది వేల మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. సొసైటీ చైర్మన్ కుర్ల చినబాబు, తూము కుమార్ తదితరులు గద్వాల్ గణపతిని దర్శించుకున్నారు.

రౌతులపూడి, (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రులు సందర్భంగా మల్లంపేటలో గురువారం ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. గణనాథుడి నిమజ్జనం సందర్భంగా గ్రామంలో 25రకాలతో అన్నదానం నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో గురువారం వినాయకుని నిమజ్జనాలు వైభవంగా నిర్వహించారు. రౌతులపూడిలో ఆటోయూనియన్, సత్యదేవాకాలనీ, యాదవకాలనీ, వెంకన్నబాబు గుడి వీధిలో వినాయకుని నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): ఏలేరు నదిలో గణనాథులను నిమజ్జనం చేశారు. పట్టణంలో తోటవీధి, మార్కెట్, మెక్కారావు కాలనీ, పెద్దవీధి, చైతన్య నగర్ కాలనీల్లో ఏర్పాటుచేసిన గణనాథులను తీన్‌మార్, బ్యాండ్ మేళాలు, డీజే సౌండ్, బాణసంచాలతో మహిళలు, చిన్నారులు డ్యాన్సులు చేస్తూ ఊరేగింపుగా తీసుకు వచ్చి గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పోలీసు సిబ్బందిని, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ రామలింగేశ్వరరావు తెలిపారు.

తొండంగి, (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలో గురువారం గణనాథుల నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 48విగ్రహాలు, ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన 50విగ్రహాలను భక్తులు కోలాహలం నడుమ సముద్రంలో నిమజ్జనం చేశారు. పెరుమాళ్ళపురం, దానవాయిపేట, వేమవరం పంపాదిపేట గ్రామాల తీరంలోని రేవుల్లో విగ్రహాలను బాజాభజంత్రీల మధ్య సంప్రదాయబద్ధంగా నిమజ్జనంచేశారు. తొండంగి ఎస్ఐ జగన్మోహన్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు

స్పీకర్ అయ్యన్నకు సత్యదేవుడి ఫొటో అందజేత



అన్నవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పుట్టినరోజు సందర్భంగా గురువారం అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయనకు స్వామివారిఫొటో, మెమెంటో, ప్రసాదం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలుఅందజేశారు. నర్సీపట్నం మండలం బలిఘట్టంలో ఉన్నఅన్నవరం ఆలయాన్ని స్పీకర్ దత్తత తీసుకున్న విషయం విదితమే. ఆలయాన్ని పరిశీలించి సౌకర్యాలపై అక్కడ ఈవో, చైర్మన్లను అడిగి తెలుసుకున్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ఏలేశ్వరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక 14వ వార్డు కౌన్సిలర్ మూది నారాయణస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. నారాయణ స్వామి నివాసంలో టీడీపీ కార్యకర్తలు, అభిమానులు భారీ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆదిత్య విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

గండేపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ ఈఈఈ తృతీయ సంవత్సర విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది కామవరపుకోటలోని ఏపీ ట్రాన్స్‌కో లిమిటెడ్‌కు చెందిన 400కేవీసామర్థ్యం గల సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. విద్యుత్ సరఫరా, రక్షణ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.బాపయ్యనాయుడు, డాక్టర్ బి.రజని పర్యవేక్షణలో సిబ్బంది విద్యార్థులకు సూచనలు, ఇచ్చారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

తొండంగి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత నెల 11న ఒంటిమామిడి గ్రామంలో చోరీ చేసిన సొత్తును దానికి పాల్పడిన నిందితులను అరెస్ట్ చేసినట్టు తొండంగి ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. అనకాపల్లి జిల్లా రేవుపోలవరం గ్రామానికి చెందిన చేపల నాని(23), యు.కొత్తపల్లి మండలానికి చెందిన బొండు శివ(21).. ఒంటి మామిడి గ్రామానికి చెందిన బొమ్మదేవ్ శారద ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని నగదు బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించారన్నారు. దీనిపై శారద ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, తుని రూరల్ సీఐ చెన్నకేశవరావుల సూచనల మేరకు ప్రత్యేక బృందం ఏర్పా టు చేసి దర్యాప్తు జరపగా విశాఖపట్నం శివాజీపాలెం యూనియన్ బ్యాంకు బ్రాంచిలో బంగా రు వస్తువులు తాకట్టు పెట్టిన రూ.2.20 లక్షలు, దొంగిలించిన సొమ్ముతో కొన్న డియో స్కూటీని నిందితుల నుంచి రికవరీ చేశామన్నారు. మొ త్తం విలువ 2.40 లక్షలుగా ఉందని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించామన్నారు.

పైలెట్ ప్రాజెక్టుగా గోవిందపురం ఎంపిక

జగ్గంపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):గోవిందపురం గ్రామాన్ని అధికారులు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికచేశారు. ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా అధికార బృందం గురువారం గ్రామంలో పర్యటించారు. ఎన్నికిలోమీటర్లు మేర డ్రైనేజీలు నిర్మించాలని ఎస్టిమేషన్ వేశారు. మ్యాజిక్ డ్రైన్ నిర్మాణ ఆవశ్యకతను సీఎం దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సంతృప్తి వ్యక్తంచేసి గ్రామాల్లో అవసరమైన చోట నిర్మించాలని ఆదేశాలు ఇవ్వడంతో గోవిందపురం వచ్చినట్టు జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్వేత తెలిపారు.

పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం

జగ్గంపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామానికి చెందిన సలాగుల బెనహర్‌కి గుండెలో రంధ్రం ఏర్పడింది. ఎమ్మెల్యే ద్వారా ముందస్తు వైద్య ఖర్చు నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధిని అర్థించగా రూ.2లక్షలు ఎల్‌వోసి శాంక్షన్ చేయటంతో గురువారం ఎమ్మెల్యే దాన్ని అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భారత్, పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు, సొసైటీ డైరెక్టర్ నండ్ల చిరంజీవి, లారీ ఓనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు మారిశెట్టి రాధా, టౌన్ యువత అధ్యక్షులు కొండ్రోతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో 11కేవీ నరేంద్రపట్నం ఫీడర్ ఆర్‌డీఎస్ఎస్ వర్క్ కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ బి.వీరభద్రరావు తెలిపారు. గొల్లలగుంట, గుర్రంపాలెం, బావవరం, కాండ్రేగుల గ్రామాల బోరులకు, బావవరం వాటర్ ప్లాంట్‌కి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మెరుగైన జీవనోపాధికి కృషి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పేదరికం లేని మెరుగైన జీవనోపాధి పెంపుదలకు అధికారులు, పాలకులు కృషి చేయాలని ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీల పురోగతి సుస్థిర పాలనపై మండల స్థాయి అధికారులు, కార్యదర్శులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ సుధాకర్ ఈ సందర్భంగా మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, శిక్షణా తరగతుల ఉద్దేశ్యాన్ని వివరించారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



కిర్లంపూడి: చిల్లంగిలో రేషన్‌కార్డులు అందిస్తున్న నాయకులు

కిర్లంపూడి, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): చిల్లంగిలో టీడీపీ నాయకుడు కాళ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తూము కుమార్, సొసైటీ చైర్మన్ కుర్ల చినబాబు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్‌రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దిడ్డి చిట్టిబాబు, మాదిరెడ్డి సూరిబాబు, యడ్ల కృష్ణ, డీలర్లు పొట్టి వీరవెంకట సత్యనారాయణ, వెంకన్నబాబు, పీలా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అలాగే జగపతినగరం గ్రామంలో జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సభ్యుడు చదరం చంటిబాబు ఆధ్వర్యంలో మూడు రేషన్ దుకాణాలకు సంబంధించి లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు.

గండేపల్లి, (ఆంధ్రజ్యోతి):స్మార్ట్‌కార్డుల ద్వారా ప్రతీ ఒక్కరికీ సక్రమంగా రేషన్ అందుతుందని టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు అన్నారు. ఆయన గురువారం గండేపల్లిలో ఆయన స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కె.చంద్రరావు, గ్రామాధ్యక్షుడు బొల్లంరెడ్డి రామకృష్ణ, వెలమాటి కాశీ, పైలా వెంకన్న, ముంగర సూర్యారావు, బాబి, కార్యదర్శి పణీంద్రకుమార్ ఉన్నారు. మల్లేపల్లిలో టీడీపీ గ్రామాధ్యక్షుడు తెలగరెడ్డి భద్రరావు ఆధ్వ ర్యంలో 9వ నెంబరు రేషన్‌షాపు వద్ద స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశారు. కొల్లి త్రిమూర్తులు, గ్రంధి నాగబాబు, కె.శ్రీను, డీలర్ బూర్లు సాయి ఉన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విజయ్‌ప్రకాష్

తునిరూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి మెరుగైన సమాజాన్ని ఏర్పాటు చేసేందుకు తోడ్పాటు అందించాలని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ పిలుపునిచ్చారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి గురుపూజోత్సవ కార్యక్రమాన్ని విజయ్‌ప్రకాష్ ప్రారంభించారు. గురుదేవుళ్లను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుల మధ్య మెరుగైన అభ్యాసం కోసం తల్లిదండ్రులు ఉపాధ్యాయ భాగస్వామ్యాన్ని ఎలా నిర్మించాలనే అంశంపై చర్చావేదిక, ఆటల పోటీలు, నృత్య, నాటక, బృంద గాన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గురువులు అంకిత భావంతో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పినప్పుడు మెరుగైన సమాజాన్ని చూడగలమని విజయ్‌ప్రకాష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయుడు వెంకట్రాజు



గురుకులాలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయుడు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గిరిజన బాలలప్రగతికి ఆ ప్రధానోపాధ్యాయుడు ఎంతో కృషి చేస్తున్నారు. తన వద్ద విద్యను అభ్యసించే విద్యార్థుల ఉన్నతికి సొంత నిధులతో పాటు సమయాన్ని, సెలవు దినాల్లో కూడా బోధన చేస్తున్నారు. ఆదర్శ ఉపాధ్యాయుడిగా మన్ననలు పొందుతున్న ఆ ఉపాధ్యాయుడు వల్లపాటి వెంకట్రాజు. కిత్తమూరుపేట గిరిజన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈపాఠశాలల విద్యార్థుల సంఖ్య స్వల్పంగా ఉండటంతో వెంకటరాజు గిరిజన కుటుంబాలకు అవగాహన కల్పించి వారి పిల్లలు పాఠశాలలో చేరే విధంగా కృషి చేశారు. సొంత నిధులతో పిల్లలను గురుకుల పాఠశాలలకు దరఖాస్తు చేయించడంతో పాటు వారికి పాఠశాల సమయం ముగిసిన తరువాత మరో 2గంటలు కేటాయించి శిక్షణ ఇచ్చేవారు. ఉత్తరకంచిలోని ఇంటి వద్ద సెలవు దినాల్లో విద్యార్థులకు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష శిక్షణకు సంబంధించిన ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించేవారు. నవోదయ, గురుకుల పాఠశాలల ఎంట్రన్స్ పరీక్షల కోచింగ్ స్టడీ మెటీరియల్‌ను ఉపాధ్యాయుడు సొంత నిధులు వెచ్చించి విద్యార్థులకు అందించారు. 2025లో కిత్తమూరిపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గురుకుల పాఠశాల ప్రవేశానికి ఉత్తమ ప్రతిభ కనబరిచి ఐదుగురు ఎంపికయ్యారు.

'ఆ కేసుతో కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు సంబంధం లేదు'

ప్రత్తిపాడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలోని ముదునూరి రామరాజుపై నమోదైన కేసుకు సంబంధించి కూటమి ప్రభుత్వానికి, ఎమ్మెల్యే సత్యప్రభకు ఎటువంటి సంబంధం లేదని టీడీపీ నియోజకవర్గ నాయకులు స్పష్టం చేశారు. ధర్మవరంలో తెలుగు రైతు జిల్లా కార్యదర్శి బొల్లు కొండబాబు స్వగృహం వద్ద గురువారం టీడీపీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీ రాష్ట్ర గ్రామీణ పరిశ్రమల మండలి డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా శివ, జిల్లా టీడీపీ నాయకుడు పర్వత సురేష్, మండల అధ్యక్షుడు అమరాది వెంకట్రావు, ఒమ్మంగి సొసైటీ అధ్యక్షుడు సత్యంశెట్టి సీతారాం, మాజీ సొసైటీ అధ్యక్షులు దాట్ల అప్పన్నబాబు మాట్లాడారు. ఎమ్మెల్యే సత్యప్రభ నియోజకవర్గంలోని ఏ ఒక్కరిపై తప్పుడు కేసులు పెట్టించలేదని వారు స్పష్టం చేశారు. ఎమ్మెల్యేపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు. సమావేశంలో నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు బొదిరెడ్డిగోపి, వెలుగుల నాని, బొల్లు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డులతో బహుళ ప్రయోజనాలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న రేషన్ స్మార్ట్‌లతో బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయని టీడీపీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు గుమ్మిడి అన్నవరం చెప్పారు. మండలంలోని పాండవులపాలెంలో గురువారం సర్పంచ్ గుమ్మడి రామలక్ష్మితో కలిసి ఎస్టీ సెల్ అధ్యక్షుడు అన్నవరం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుమ్మిడి మాట్లాడుతూ అవినీతి, అక్రమాలకు తావులేకుండా స్మార్ట్‌కార్డులు పారదర్శకత రేషన్ పంపిణీకి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

శంఖవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వరిలో ఎక్కువగా వచ్చే తుంగ, గిరిక, ఊదా, పిల్లడుగు వంటి కలుపు మొక్కలను తొలిదశలోనే తొలగించాలని వ్యవసాయాధికారి పి.గాంధి పేర్కొన్నారు. గురువారం అరెంపూడిలో రైతులకు సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కలుపు మొక్కలు నీటి, సూర్యరశ్మి కోసం పోటీపడి ప్రధాన పంట దిగుబడిని తగ్గిస్తాయని తెలిపారు.

పంచాయతీ పురోగతిపై వర్క్‌షాప్

గండేపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ పురోగతిపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. పీఏఐ వెర్షన్ 2.0లో ఏ, ఏ ప్లస్‌పై సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రరావు, సిబ్బంది ఉన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా త్రివేణి

గండేపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మురారి ప్రాథమిక పాఠశాల సెకెండ్ గ్రేడ్ ఉపాధ్యాయురాలు వాసంశెట్టి త్రివేణి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆమెను గురువారం టీడీపీ మండల యువ నాయకుడు జాస్తి వసంత్, ఎంపీడీవో కె.చంద్రరావు, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, అధికారులు, సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆదినారాయణమూర్తి



కిర్లంపూడి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బూరుగుపూడి మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంకిపాటి ఆదినారాయణ మూర్తి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకుంటారు. ఈసందర్భంగా ఆయనకు ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది,శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా శ్రీనివాస్



తొండంగి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎల్లయ్యపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సీహెచ్ శ్రీనివాస్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌ను ఎంఈవో షేక్ బాబ్జి, అనిశెట్టి సుబ్బిరెడ్డి తదితరులు అభినందించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా శ్రీనివాస్, ప్రసన్న





రౌతులపూడి, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా యర్రా శ్రీనివాస్, గోడి ప్రసన్నలకు ఎంపికయ్యారు. శ్రీనివాస్ ఎ.మల్లవరం స్కూల్ హెచ్‌ఎంగా, ప్రసన్న బలరామపురంలో ప్రైమరి స్కూల్‌లో పని చేస్తున్నారు. వీరికి ఎంఈవోలు సతీష్, కొండబాబు, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు హరిబాబు, అచ్చిరాజు, నాగరాజు, ఆర్‌వీఆర్ మూర్తి, రాంబాబు తదితరులు అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా చంటిబాబు



శంఖవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కత్తిపూడి ఈబీసీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎస్ చంటిబాబు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. చంటిబాబుకు అవార్డు రావడంపై ఎంఈవో ఎస్వీ రమణ, కుర్రే వెంకటేశ్వరరావు, తోట సీతారామయ్య, చిన్నాల అప్పలరాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక

జగ్గంపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట అంబేడ్కర్ కాలనీ ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాకచర్ల వరలక్ష్మికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు ఎంపికయ్యారు. ఆమెను సహచర ఉపాధ్యాయులు సన్మానించారు.

గురుపూజోత్సవం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మినర్వా విద్యా సంస్థలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. విద్యా సంస్థల చైర్మన్ ముత్యాల మురళీకృష్ణ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎం. సుబ్రహ్మణ్యం (రిటైర్డ్ ఎంఈవో) మాట్లాడారు.